# నిమజ్జనోత్సవాల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** గణేశ్ నిమజ్జనోత్సవాల ప్రక్రియను ఉత్సవ నిర్వాహకులు వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. వర్షం కురిసే అవకాశమున్నందున నిర్వాహకులు ఈ దిశగా ఆలోచించాలని కోరారు. ఈ రోజు రాత్రి వరకు నిమజ్జనోత్సవాన్ని పూర్తి చేయాలనే భావిస్తున్నట్టు ఆయన తెలిపారు. గణేశ్ నిమజ్జనోత్సవాల ప్రక్రియను మంత్రి పొన్నం ప్రభాకర్ డీజీపీ సీవీ ఆనంద్, సీపీ సజ్జనర్, కలెక్టర్ ప్రియాంక అల, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌తో కలిసి విహంగ వీక్షణం చేశారు.



**గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ బడా గణేశుడు**

హుస్సేన్ సాగర్ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. డప్పు చప్పుళ్లు, భక్తుల ఆటపాటలు, నృత్యాలతో సందడి వాతావరణం నెలకొంది. హైదరాబాద్‌లో మొత్తం 114 నిమజ్జన కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిమజ్జనం కోసం 14,840 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటికే 10వేలకు పైగా విగ్రహాలు పూర్తయ్యాయని సీపీ సజ్జనర్ తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా నిమజ్జనోత్సవం జరుగుతుందన్నారు. శనివారం ఉదయం లోపు అన్ని విగ్రహాల నిమజ్జనం పూర్తవుతుందని భావిస్తున్నట్టు చెప్పారు.

# పెన్ పవర్ తెలంగాణ రౌండప్



లడ్డూ ప్రసాదాన్ని ఇంటికి తెచ్చిన అనంతరం..



దుండిగల్ సర్కిల్ సిఎంసి మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ చౌహాన్..

- గాగిల్లాపూర్ తండాలో మహా వినాయకుడి ప్రసాదానికి భారీ వేలం..
- కొర్ర వినయ్ నాయక్ లడ్డూ ప్రసాదం సొంతం చేసుకున్నారు..
- తొమ్మిది రోజుల నవరాత్రి పూజలు అందుకున్న గణనాథుడి ప్రసాదం..
- కుటుంబ సభ్యులతో కలిసి లడ్డూను ఊరేగింపుగా ఇంటికి తరలింపు..
- గణపయ్య ఆశీస్సులతోనే ప్రసాదం దక్కిందన్న కొర్ర శంకర్ నాయక్ చౌహాన్..
- విఘ్నేశ్వరుడికి తాండా వాసులు భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలు..

# గణనాథుడి లడ్డూ..! రూ.9.10 లక్షలకు కైవసం..!

## గాగిల్లాపూర్ తండాకు చెందిన కొర్ర వినయ్ నాయక్‌కు లడ్డూ సొంతం..

**దుండిగల్, పెన్ పవర్, సెప్టెంబర్ 25:** దుండిగల్ సర్కిల్ సిఎంసి పరిధిలోని, గాగిల్లాపూర్ తాండాలో, తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలు అందుకున్న గాగిల్లాపూర్ తండా మహా వినాయకుడి లడ్డూ ప్రసాదానికి భారీగా ధర పలికింది.. గణనాథుడి లడ్డూ ప్రసాదం వేలంపాటలో రూ.9,10 లక్షలు (తొమ్మిది లక్షల పది వేల రూపాయలు) కు కైవసం అయింది.. గాగిల్లాపూర్ తండాకు చెందిన రవీందర్ నాయక్ కుమారుడు కొర్ర వినయ్ నాయక్ ఈ లడ్డూ ప్రసాదాన్ని వేలంలో దక్కించుకున్నారు. తొమ్మిది రోజుల నవరాత్రి ఉత్సవాల్లో విఘ్నేశ్వరుడి పూజలు అందుకున్న మహాగణపతి లడ్డూ ప్రసాదాన్ని వేలంలో దక్కించుకున్న వినయ్ నాయక్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం లడ్డూ ప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తమ ఇంటికి తీసుకెళ్లారు.

**'గణపయ్య ఆశీస్సులతోనే లడ్డూ దక్కింది'.**

దుండిగల్ మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ సీనియర్ నేత కొర్ర శంకర్ నాయక్ చౌహాన్ మాట్లాడుతూ.. తన సోదరుని కుమారుడు వినయ్ నాయక్‌కు ఆ విఘ్నవినాశకుడి ఆశీస్సులు లభించాయని, గణపయ్య అనుగ్రహంతోనే పవిత్ర లడ్డూ ప్రసాదం తమ కుటుంబానికి దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మహాగణపతి ఆశీస్సులతో వినయ్ కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.. గజాననుడి ఆశీస్సులు వినయ్ నాయక్ కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని, ఆ వక్రతుండుడి అనుగ్రహంతో కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలగాలని కోరుకున్నారు.



వేలంపాట అనంతరం లడ్డూ ప్రసాదంతో వినయ్ నాయక్ కుటుంబం..

# ఈ నెలాఖరు నాటికి 'సర్' ప్రక్రియ పూర్తి చేయండి



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర వ్యాప్తంగా 60 శాతం ఓటర్లకు నోటీసులు పంపిణీ చేశామని, ఈ నెలాఖరు నాటికి 'సర్' ప్రక్రియ పూర్తి చేయిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్ దీపక్ తివారితో కలిసి వికారాబాద్ పట్టణంలోని ఆలంపల్లి, శివారెడ్డిపేట, తాండూరులో పర్యటించారు. జిల్లాలో చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు ఎన్ని నోటీసులు జారీ చేశారు. ఇంకా ఇవ్వాల్సిన నోటీసులు ఎన్ని అని బీఎల్వోలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈఆర్వోలు, తహసీల్దార్లతో సమీక్షించారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరును జాబితా నుంచి తొలగించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాజకీయ నాయకులతో సమావేశాలు నిర్వహించాలని ప్రతి దశను సమర్థంగా పూర్తి చేయాలన్నారు. ముందుగా కలెక్టరేట్‌లో పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, శిక్షణ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్, డీఎస్పీ అంజయ్య, డీఆర్వో స్వర్ణలత, ఆర్డీవోలు వాసుచంద్ర, అనిత, వికారాబాద్, పరిగి, కొడంగల్ పుర కమిషనర్లు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# కనులపండువగా మహా నిమజ్జనం



- సందడిగా ఖైరతాబాద్ గణపతి శోభాయాత్ర
- హుస్సేన్‌సాగర్‌కు వేల సంఖ్యలో వచ్చిన ప్రతిమలు
- రూ.39 లక్షలు పలికిన బాలాపూర్ గణేశుడి లడ్డూ
- బాలాపూర్ గణేష్ నిమజ్జనం పూర్తి.. శోభాయాత్ర సాగిందిలా..



**హైదరాబాద్ పెన్ పవర్:** గణేశుడి మహా శోభాయాత్ర హైదరాబాద్‌లో శుక్రవారం అత్యంత వైభవంగా సాగింది. 11 రోజులపాటు విశేష పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. భక్తులందరూ ఎంతో ఆసక్తిగా చూసిన 69 అడుగుల ఖైరతాబాద్ మహాగణపతి శోభాయాత్ర ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైంది. లక్డీకాపూల్, టెలిఫోన్ భవన్, సచివాలయం, తెలుగుతల్లి ఫ్లైఓవర్ మార్గం గుండా మధ్యాహ్నం ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నంబరు 4 వద్దకు చేరుకుంది. పూజా కార్యక్రమాల అనంతరం 2.40 గంటలకు మహా గణపతిని గంగమ్మ ఒడికి చేర్చారు. వేలసంఖ్యలో నిమజ్జనానికి తరలి వచ్చిన గణనాథులతో ట్యాంక్‌బండ్ పరిసరాల్లో కోలాహలం నెలకొంది. వినాయక విగ్రహాలను తిలకించేందుకు నగరం నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి లక్షల మంది తరలివచ్చారు. హుస్సేన్‌సాగర్‌తోపాటు నగరంలో 141 ప్రాంతాల్లో అధికారులు నిమజ్జన కేంద్రాలను ఏర్పాటు చేశారు. నగర పరిధిలో నాలుగు కమిషనరేట్లలో దాదాపు 45 వేల మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

4 లో





- నిజాంపేట్ సర్కిల్ 275వ డివిజన్‌లో మహనీయునికి ఘన నివాళులు..
- బండారి లేఔట్ 9బీ పార్కులో మొక్కలు నాటిన బీజేపీ నాయకులు..
- దీన్‌దయాళ్ ఆశయాలే దేశ ప్రగతికి బాటలు: బిక్షపతి యాదవ్..
- ఏకాత్మ మానవతావాద సిద్ధాంతకర్త దీన్‌దయాల్ ఉపాధ్యాయ..
- సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా కార్యక్రమం..
- అంత్యోదయమే లక్ష్యంగా అభివృద్ధి సాగాలన్న పిలుపు..





# దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలు ఆదర్శనీయం..!

## బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు..!

దుండిగల్, పెన్ పవర్, సెప్టెంబర్ 25: ఏకాత్మ మానవతావాద సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు నిజాంపేట సర్కిల్‌లోని 275వ డివిజన్‌లో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా డివిజన్ అధ్యక్షుడు బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.. ఈ సందర్భంగా బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ.. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సామాన్య కుటుంబంలో జన్మించి దేశ సేవకు తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. ఆర్ఎస్ఎస్‌లో పూర్తిస్థాయి కార్యకర్తగా పనిచేస్తూ, పాత్రికేయుడిగా, సామాజికవేత్తగా, ఆర్థికవేత్తగా, రాజకీయ కార్యకర్తగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలకు ప్రాధాన్యతనిస్తూ 'ఏకాత్మ మానవతావాదం' సిద్ధాంతాన్ని దేశానికి అందించారని పేర్కొన్నారు. దేశాభివృద్ధి ప్రణాళికలు భారతీయ పరిస్థితులకు అనుగుణంగా ఉండాలని, రాజకీయ--ఆర్థిక రంగాల్లో వికేంద్రీకరణతో పాటు సమాజంలోని చివరి వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలాలు అందాలన్నది దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయమని బిక్షపతి యాదవ్ తెలిపారు..

## ఆయన అలోచనలే కేంద్ర ప్రభుత్వ పథకాలు..

ఆయన ఆలోచనలకు అనుగుణంగా అంత్యోదయ యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, బేటీ బచావో--బేటీ పడావో, ఆత్మనిర్భర్ భారత్ వంటి పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అన్నారు.. అనంతరం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జ్ఞాపకార్థం బండారి లేఔట్‌లోని 9బీ పార్కులో బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు సమాజ సేవకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నాయకులు పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి దాసి నాగరాజు, ప్రధాన కార్యదర్శి సచిన్, బీజేవైఎం అధ్యక్షుడు ఎన్.ఆర్.కె. ముదిరాజ్, సీనియర్ నాయకులు సతీష్, కృష్ణ, విష్ణుదత్త, ప్రసాద్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..







# జై భవాని నగర్‌లో.. ఘనంగా గణనాథుని నిమజ్జనం..



## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేత వారాల వినోద్..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, సెప్టెంబర్ 25: సాయిబాబా నగర్ సిఎంసి 292వ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ, జై భవాని నగర్‌లో, జై భవాని నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.. గణనాథుని నిమజ్జనాన్ని పురస్కరించుకుని జై భవాని నగర్‌లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతి బప్పా మోరియా నినాదాలతో సందడి చేశారు. యువత ఆధ్వర్యంలో నిర్వహించిన నిమజ్జన కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.. ఈ సందర్భంగా పాండు బస్తీలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలోనూ వారాల వినోద్ కుమార్ పాల్గొని భక్తులు, బస్తీవాసులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించి, చివరి రోజున నిమజ్జన కార్యక్రమంతో ఉత్సవాలను ముగించారు.ఈ సందర్భంగా వారాల వినోద్‌కుమార్ మాట్లాడుతూ, గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఉత్సవాలను ఐక్యతతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించిన జై భవాని నగర్ యూత్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. అలాగే అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజ్‌కుమార్ ముదిరాజ్, ఈమాకర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, బాలు, అంజి, పాండు, సాయిబాబా, సాయిరామ్, రాకేష్, శేఖర్, రాహుల్, నవీన్, రిత్విక్, నందు, సాయి, వంశీ, బన్నీ, సాయికుమార్, వెంకటేష్ తదితరులతో పాటు జై భవాని నగర్ బస్తీవాసులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..



# కనులపండువగా మహా నిమజ్జనం

-3 పేజి తరువాయి

ఖైరతబాద్ మహాగణపతి తర్వాత అంతే స్థాయిలో పేరు గాంచిన బాలాపూర్ గణేష్ నిమజ్జనం పూర్తయింది. 2026 సెప్టెంబర్ 25వ తేదీన సాయంత్రం 4.36 గంటలకు నిమజ్జనం పూర్తి చేశారు. క్రేన్ నెంబర్ 12 దగ్గర నిమజ్జనం జరిగింది.

బాలాపూర్ గణేష్ లడ్డూ వేలం పాట ముగిసిన వెంటనే అత్యంత వైభవంగా శోభాయాత్ర ప్రారంభమైంది. ప్రసిద్ధి గాంచిన బాలాపూర్ వినాయకుడిని దర్శించుకోవడానికి, అలాగే శోభాయాత్రను ప్రత్యక్షంగా చూడడానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశారు.

**నిమజ్జనానికి భారీ ఏర్పాట్లు**

హుస్సేన్ సాగర్ తీరంతో పాటు నిమజ్జనం జరిగే అన్ని ప్రాంతాలలో అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. వినాయక విగ్రహాలను త్వరితగతిన గంగమ్మ ఒడికి చేర్చే విధంగా భారీ క్రెయిన్లను సిద్ధం చేశారు. భక్తుల రద్దీని నియంత్రించడానికి ప్రత్యేక రోప్ పార్టీలను ఏర్పాటు చేయడంతో పాటు పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

భద్రతా పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. నిఘా కోసం ప్రత్యేకంగా డ్రోన్లను ఉపయోగిస్తూ ప్రతి క్షణం పరిస్థితిని సమీక్షిస్తున్నారు. భక్తులందరూ ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకునేలా అన్ని శాఖల సమన్వయంతో అధికారులు చర్యలు తీసుకున్నారు.

**శోభాయాత్ర సాగిందిలా..**

బాలాపూర్ గణేష్ శోభాయాత్ర ఎంతో భక్తిశ్రద్ధలతో భక్తుల కోలాహలం నడుమ సాగింది. బాలాపూర్ గణేష్ మండపం ఉన్నటువంటి హనుమాన్ టెంపుల్ ప్రాంతం నుంచి హుస్సేన్ సాగర్ వరకు మొత్తం 19 కిలోమీటర్ల శోభాయత్ర జరిగింది.

బాలాపూర్ నుండి ప్రారంభమయ్యే శోభాయాత్ర పాతబస్తీ, సెంట్రల్ హైదరాబాద్‌లోని ప్రధాన ప్రాంతాల మీదుగా సాగింది. బాలాపూర్ (మండపం)కేశవగిరి , చంద్రాయణగుట్ట , ఫలక్‌నామా , అలీబాద్ , నాగుల్‌చింత, చార్మినార్ , మదీనా, అఫ్జల్‌గంజ్, ఎం.జే. మార్కెట్, అబిడ్స్ , బషీర్‌బాగ్, లిబర్టీ, తెలుగుతల్లి ఫ్లైఓవర్, ఎన్‌టీఆర్ మార్గ్ మీదుగా పీవీఎన్ఆర్ మార్గ్ నుంచి హుస్సేన్ సాగర్ కు చేరుకుంది. 4:36 నిమిషాలకు నిమజ్జనం జరిగింది.

# సఖి కేంద్రం సేవలు మరింత సమర్థవంతంగా అందించాలి

**జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్**

**కరీంనగర్: పెన్ పవర్:** మహిళలకు రక్షణ, న్యాయ సహాయం, కౌన్సెలింగ్‌తో పాటు అవసరమైన సేవలను అందిస్తున్న సఖి వన్‌స్టాప్ సెంటర్ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్ సూచించారు. శుక్రవారం ప్యానల్ అడ్వకేట్లతో కలిసి కరీంనగర్ సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించిన ఆయన, కేంద్రంలో నమోదవుతున్న కేసులు, బాధితులకు అందుతున్న న్యాయ సహాయం, కౌన్సెలింగ్, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం తదితర సేవలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లు, కేసు ఫైళ్లు, రికార్డులను పరిశీలించి, కేసుల పురోగతిపై సమీక్షించారు. షెల్టర్ రూమ్, కౌన్సెలింగ్ గదులు, పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతతో పాటు బాధితులకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రొటెక్షన్ ఆఫీసర్, సఖి కేంద్రం ద్వారా దాఖలయ్యే గృహహింస కేసులను క్రమం తప్పకుండా సమీక్షిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని, సంబంధిత శాఖలు, లీగల్ కౌన్సిల్, సఖి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. బాధితుల గోప్యతను కాపాడుతూ వారి హక్కులు, అందుబాటులో ఉన్న న్యాయ పరిహారాలపై అవగాహన కల్పించాలని సూచించారు. న్యాయ సహాయం అవసరమైన బాధితులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మహేష్ తణుకు, ప్యానల్ అడ్వకేట్లు ఏ. కిరణ్ కుమార్, పెరుక రంగయ్య, సి. హెచ్. చంద్రప్రకాష్ రెడ్డి, సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ దామెర లక్ష్మి, లీగల్ కౌన్సిలర్ ఎన్. సంధ్యారాణి, సోషల్ కౌన్సిలర్ రేణుక, కేస్ వర్కర్ పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు ఉండాలి

**గుడిసెలు లేని వనపర్తి జిల్లా లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు.**

**హైదరాబాద్ పెన్ పవర్:** మొదటి విడతలో ఇంటి నిర్మాణం ప్రారంభించుకొని వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇళ్లకు ఒకేసారి బిల్లులు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి.ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయి ఆర్థిక స్తోమత లేక కట్టుకోలేని పేదలకు కాంట్రాక్టర్ ద్వారా ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు.ప్రతి పేదవానికి ఒక పక్కా ఇల్లు ఉండాలి అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని 100% విజయవంతం చేసేందుకు వనపర్తి జిల్లాలో గుడిసెల్లో నివసించే ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే కాకుండా.. ఆర్థిక స్థోమత లేక ఇల్లు కట్టుకోలేని నిరుపేదలకు ప్రభుత్వమే ముందుకు వచ్చి లబ్ధిదారునికి కాంట్రాక్టర్ ద్వారా ఇల్లు నిర్మించి ఇచ్చే విధంగా ప్రభుత్వము చర్యలు తీసుకుంటుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి వివరించారు.ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక స్తోమత లేని లబ్ధిదారులతో శుక్రవారం వనపర్తి ఐ డి ఓ సి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన జిల్లా గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆత్మగౌరవం కొరకు ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు ఉండాలి అనే సంకల్పంతో ఈ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని మొదటి విడతగా ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయడం జరిగిందని దానితోపాటు గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అదేవిధంగా గోడలు ఉండి పైకప్పు రేకులు పెంకులతో ఉన్న వారికి పైకప్పు వేసుకునే విధంగా రెండో విడతలో నియోజకవర్గానికి మరో 2000 ఇళ్ళ చొప్పున మంజూరు చేయడం జరిగింది అన్నారు.ఈ సందర్భంలో వనపర్తి నియోజకవర్గం లో మొదటి విడత మంజూరు చేసిన ఇళ్లలో ఆర్థిక స్థోమత లేక దాదాపు 300 మంది మంజూరు ఉత్తర్వులు పొంది ఇల్లు నిర్మించుకోలేదని అలాంటి వారికి లబ్ధిదారులు ఒప్పుకుంటే కాంట్రాక్టర్ ద్వారా నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం కొత్త పథకాన్ని తీసుకువచ్చిందన్నారు.

ఈ పథకంలో లబ్ధిదారులు కాంట్రాక్టర్ బ్యాంకరు ముగ్గురు పేరున ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి పని జరిగే విధంగా విడుతలవారీగా ముందుగా డబ్బులు లబ్ధిదారుని ఖాతాలో జమ చేసి అనంతరం కాంట్రాక్టర్ కు బదిలీ చేయడం జరుగుతుంది. 418 చదరపు కడుపులో 9 పిల్లర్లు రెండు అడుగుల బేస్మెంట్ వరకు వేసి, సిమెంట్ ఇటుకలతో ఒక హాల్, బెడ్ రూమ్, కిచెన్, లాటరిన్ బాత్రూమ్ తో కూడిన చక్కని ఇందిరమ్మ ఇంటిని కాంట్రాక్టర్ ద్వారా నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు.లబ్ధిదారులు ఒప్పుకొని స్వచ్ఛందంగా కాంట్రాక్టర్ తో ఒప్పందం చేసుకుంటే మూడు నెలల్లోనే ఇల్లు పూర్తి చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు.పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేస్తే కొందరు అప్పులు తీసుకువచ్చి అవసరం లేకున్నా ఎత్తయిన బేస్మెంట్లు నిర్మించుకొని ఇల్లు పూర్తి అయ్యేవరకు అప్పుల పాలవుతున్నారని దానివల్ల వారు పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయే ప్రమాదం ఉందన్నారు. అవసరం బట్టి నాన్యమైన ఇళ్ళు కట్టుకోవాలి తప్ప అనవసర ఆర్భాటాలకు వెళ్లి అప్పుల పాలు కావద్దని లబ్ధిదారులను సూచించారు.మొదటి విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరై వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లకు త్వరలో ఒకేసారి మొత్తం పేమెంట్ చేసే విధంగా ప్రభుత్వము ప్రత్యేక ఉత్తర్వులను జారీ చేసిందని తెలియజేశారు.దేశంలో ఎల్ నీనో ప్రభావం వచ్చే జూలై వరకు ఉంటుందని అందువల్ల ప్రజలు ఉన్న నీటిని చాలా పొదుపుగా వాడుకోవాలని నల్లాలు ఓపెన్ చేసి వదిలేయడం సరికాదని నీటి విలువను గుర్తించాలని చెప్పారు. విద్యుత్ వినియోగం సైతం అవసరం మేరకు మాత్రమే వాడాలని ప్రభుత్వం డబ్బులు ఇచ్చినా విద్యుత్తు నీరు దొరికే అవకాశం లేదని తెలియజేశారు.వనపర్తి నియోజకవర్గం లో మొదటి విడతలో 3500 ఇళ్లు మంజూరు చేయగా అందులో 3164 ఇళ్లకు మంజూరు పత్రాలు ఇవ్వడం జరిగిందని, రెండో విడతలో 258 వెరసి 3422 లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలు దారి చేయడం జరిగింది. ఇందులో ఇప్పటివరకు 1040 ఇల్లు పూర్తి స్థాయిలో నిర్మించుకొని మిగిలినవి వివిధ నిర్మాణ స్థాయిలో ఉన్నాయన్నారు.

# 211 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల అందజేత

**సూర్యాపేట: పెన్ పవర్:** కోదాడ పట్టణ పరిధిలోని 211 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కల సాకారమవుతోందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని అధికారులు సూచించారు. ఎనిమిదో వార్డులో ఇండ్లు మంజూరైన భూక్య శాంతి, భూక్య నాగమణి, భూక్య రమణమ్మ, చలిగంటి నాగలక్ష్మి కొమ్మూరు లావణ్య, మాలోతు ప్రమీల లకు వార్డు కౌన్సిలర్ ఉదయశ్రీ హరిప్రసాద్ ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వెంటనే మోటార్లు నడిపి జలాశయాలను నింపాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** గోదావరి జలాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో కేసీఆర్ గారు కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవస్థను నిర్మించారు. ఇందులో భాగంగా 141 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లను ఏర్పాటు చేశారు. గోదావరిలో వరద వచ్చినప్పుడు ఆ నీటిని ఒడిసిపట్టి రిజర్వాయర్లను నింపితే రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఒకవైపు వర్షాభావ పరిస్థితులు.. మరోవైపు గోదావరిలో భారీ వరద ప్రవాహం ఉన్నా, ఆ నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపడంలో మీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం ఆందోళన కలిగిస్తోంది. నీళ్లు అందక పంటలు ఎండిపోతుంటే మీరు మాత్రం ప్రాజెక్టుల మీద రాజకీయాలు చేస్తూ పంటలు ఎండగొడుతున్నారు. గోదావరి జలాలను లిఫ్ట్ చేయకుండా చోద్యం చూస్తున్నారు.

ఒకవైపు గోదావరిలో వరద ప్రవాహం కొనసాగుతుంటే, మరోవైపు అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక సాగర్ రిజర్వాయర్ డెడ్ స్టోరేజీలో ఉన్నాయి. మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 13 టీఎంసీలు మాత్రమే ఉండడం ఆందోళన కలిగిస్తుంది. ఇక్కడ 50 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం అందుబాటులో ఉంది. మల్లన్న సాగర్ నిండుకుండలా మారితే హైదరాబాద్ తాగునీటి అవసరాలతో పాటు, మీరు చెబుతున్న మూసీ ప్రాజెక్టుకు కూడా ఇక్కడి నుంచి నీటిని తరలించే అవకాశం ఉంటుంది. కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌లోనూ 15 టీఎంసీలకు కేవలం 6 టీఎంసీలే ఉన్నాయి. ఇక్కడికి సైతం నీటిని ఎత్తిపోస్తే యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లకు ప్రయోజనం చేకూరుతుంది.

ఎల్లంపల్లిలో నీటి ఎత్తిపోతలు ప్రారంభిస్తే మిడ్ మానేరు సహా అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్లకు నీటిని తరలించడంతో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా పూర్తి పరిష్కారం లభిస్తుంది. ఈ రిజర్వాయర్లను నింపడం వల్ల దాదాపు 5 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణానికి దోహదం చేసినట్లవుతుంది.

మరోవైపు మిడ్ మానేరు దిగువన ఉన్న లోయర్ మానేరు డ్యాం (ఎల్.ఎం.డి.)లో ప్రస్తుతం 11 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఇక్కడికి నీటిని తరలిస్తే కరీంనగర్, వరంగల్ జిల్లాల సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయి. పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, యాదాద్రి భువనగిరి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాల్లోని రైతులు, ప్రజలకు ఎంతో మేలు చేసిన వారవుతారు.

మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో మా ప్రభుత్వ హయాంలో నిర్మించిన పామాయిల్ ఫ్యాక్టరీని మీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రారంభించారు. ఈ పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్వహణ కోసం రంగనాయక సాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని తరలించేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయడం జరిగింది. అయితే రంగనాయక సాగర్‌లో నీళ్లు లేకపోవడం వల్ల పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్వహణ ఇబ్బందిగా మారింది. ఈ పరిస్థితితో పామ్ ఆయిల్ సాగు చేస్తున్న రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నీటి కోసం రైతులు కళ్లల్లో వత్తులు వేసుకుని ఎదురు చూస్తుంటే, మీరు మాత్రం నదుల్లో వస్తున్న నీళ్లను లిఫ్ట్ చేయకుండా కిందకు వదిలిపెడుతున్నారు.

ప్రస్తుతం గోదావరి నదిలో ఎల్లంపల్లి వద్ద వరద ప్రవాహం భారీగా కొనసాగుతున్నది. ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకొని అన్ని మోటార్లను నడిపి నీళ్ళు లిఫ్ట్ చేసే అవకాశం ఉన్నా మీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఉద్దేశపూర్వకంగా మీరు చేస్తున్న నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతున్నది. జలకళతో కనిపించాల్సిన రిజర్వాయర్లు ఎండిపోయి కనిపిస్తున్నాయంటే దానికి కారణం నీటి నిర్వహణలో మీ ప్రభుత్వ వైఫల్యం.

ఇప్పటికైనా కళ్లు తెరవండి. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం లేదు మంత్రిగారు. ఎల్‌నినోను సాకుగా చూపకుండా, అందివచ్చిన గోదావరి వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా ఆన్-ఆఫ్ పద్ధతిలో కాకుండా 24 గంటల పాటు అన్ని మోటార్లు నడిపి జలాశయాలను నింపాలని డిమాండ్ చేస్తున్నాం. రాజకీయాలను పక్కన పెట్టి రైతు ప్రయోజనాల కోసం ఆలోచించాలని, ప్రకృతిపై నెపం నెట్టి రైతులకు సాగు నీళ్లు ఇచ్చే బాధ్యత నుంచి తప్పించుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం

# నిమజ్జన ఉత్సవ సమితి కీలక కార్యవర్గానికి సన్మానం

**హుజురాబాద్ పెన్ పవర్:**
హుజురాబాద్ పట్టణంలో గణపతి నిమజ్జన ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో కీలకంగా పనిచేసిన గణపతి నిమజ్జన ఉత్సవ సమితి కార్యనిర్వహణ కమిటీని శుక్రవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్‌రావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నిమజ్జన ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విష్ణుదాసు గోపాల్‌రావు, గౌరవ సలహాదారులు మంచికట్ల మురళి, కళ్లెపు సుధాకర్‌రావు, గుంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిమజ్జనం అనంతరం ఉత్సవ సమితిని ప్రత్యేకంగా పిలిచి సమీక్ష సమావేశం నిర్వహించడం ఇదే తొలిసారని తెలిపారు. కార్యక్రమంలో జరిగిన మంచి, చెడు, లోటుపాట్లను సమీక్షించుకోవడం ద్వారా భవిష్యత్ ఉత్సవాల్లో వాటిని సరిదిద్దుకునే అవకాశం ఉంటుందన్నారు.హుజురాబాద్‌లో గణపతి నిమజ్జనం ఎన్నడూ లేనివిధంగా సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో జరిగిందని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో పలుమార్లు సమావేశాలు నిర్వహించి మండపాల నిర్వాహకులతో చర్చించడం వల్ల ప్రతి ఒక్కరూ సూచనలను పాటించారని పేర్కొన్నారు. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసినప్పటికీ సాయంత్రం 6 గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు 12 గంటల పాటు గణపతి విగ్రహాలు ఊరేగింపుగా తరలివచ్చాయని తెలిపారు. మంగళ వాయిద్యాలు, మహిళల కోలాటాలు, చిన్నారుల నృత్యాలు, డప్పు చప్పుళ్లతో భక్తులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిమజ్జన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారని అభినందించారు.నిమజ్జన కార్యక్రమం విజయవంతం కావడంలో మున్సిపల్ పాలకవర్గం, సిబ్బందితో పాటు ఆర్డీఓ జలకుమారి, తహసీల్దార్ నరేందర్, ఏసీపీ మాధవి, సీఐలు కరుణాకర్, శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు అందించిన సహకారం మరువలేనిదని తెలిపారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరూ సమష్టిగా పనిచేయడంతో నిమజ్జన కార్యక్రమం విజయవంతమైందన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కమిషనర్ కిషన్, మేనేజర్ భూపాల్‌రెడ్డి, ఏఈ నరేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌లు నిమజ్జన ఉత్సవ సమితి కార్యవర్గాన్ని శాలువాలతో ఘనంగా సత్కరించారు. నిమజ్జన ఏర్పాట్లలో విశేషంగా పనిచేసిన మున్సిపల్ సిబ్బందిని కూడా సత్కరించారు.

చైర్‌పర్సన్ సుహాసిని మాట్లాడుతూ.. నిమజ్జన ఉత్సవ సమితి కార్యనిర్వహణ కమిటీ 200 శాతం అంకితభావంతో పనిచేసిందని, వారి సహకారం మున్సిపల్ పాలకవర్గానికి ఎంతో దోహదపడిందని అన్నారు. సమితి అందించిన సేవలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. రాబోయే బతుకమ్మ, దసరా పండుగలను కూడా ఇదే స్ఫూర్తితో ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ సమితి సహకారం అవసరమని పేర్కొన్నారు.

అనంతరం నిమజ్జన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ సుహాసిని, కమిషనర్ కిషన్, మేనేజర్ భూపాల్‌రెడ్డి, ఏఈ నరేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌లను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు కన్నన్ దురైరాజు, నల్లగోని రాకేష్, కోరపల్లి సురేష్, సలహాదారులు అంకతి వాసు, కనకం శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు అయిత సందీప్, పంజాల సతీష్, కోశాధికారి కొమురవెల్లి సంతోష్, కార్యవర్గ సభ్యులు భూసారపు శ్రీనివాస్, ఆకుల సదానందం, నూనె సదానందం, కందుల సందీప్, నాగకోయల్ కార్ సుమన్, మేకల మల్లేష్, మేకల తిరుపతి, కొమురవెల్లి రాజు, దామెర అనురాగ్, సందమల్ల బాబు, పాషా సౌండ్స్ ఉల్ఫత్, మున్సిపల్ జవాన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏవియేషన్ రంగంలో మెండుగా ఉపాధి అవకాశాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**
విమానయాన రంగంలో రాణించి మంచి కెరీర్ని సాకారం చేసుకోవాలనుకునే యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని వీటిని ఉపయోగించుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఏ సాంబశివ రావు సూచించారు. హైదరాబాద్ లోని ముషారాంబాగ్ లో ఉన్న గో ఫ్లై క్యాంపస్ ఏవియేషన్ ట్రైనింగ్ సంస్థ వారు గోదావరిఖని విచ్చేసి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు.సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేట మండలం నుండి ఈ సంస్థలో ట్రైనింగ్ పొందిన బి. అక్షయ మాట్లాడుతూ – తెలంగాణ రాష్ట్రంలో సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గౌరవనీయులు గరిమా అగర్వాల్ మరియు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేక శ్రద్ధతో ఏవియేషన్ రంగంలో కెరీర్ ని స్థిరపరుచుకోవాలనుకున్న వారికి వారధి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి మరియు ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ లేదా డిగ్రీ పూర్తి చేసిన అవివాహిత యువతకు (18 సంవత్సరాల నుండి 27 సంవత్సరాల వరకు) ఎయిర్ హోస్టెస్, ఎయిర్పోర్ట్ గ్రౌండ్ స్టాఫ్ విభాగాలలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్టు ఇందుకోసం ప్రతి బ్యాచ్ కి 45 మందికి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నారని చెప్పారు (కోర్స్ ఫీజ్ ఒక లక్షా తొమ్మిది వేలు – 109000/ కలెక్టర్ చెల్లిస్తారు). కాబట్టి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందడుగు వేయాలని ఈ సంతలో ట్రైనింగ్ పొందిన రష్మిత, సుప్రియ, అయాన్ చెప్పారు. మొత్తం ఆరు నెలల నుండి 8 నెలల పాటు అవసరమైన వృత్తి నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రయాణికుల సేవలు, వ్యక్తిత్వ వికాసం, గ్రూమింగ్, ఎయిర్పోర్ట్ నిర్వహణ తదితర అంశాల్లో సమగ్ర శిక్షణ విజయవంతంగా ట్రైనింగ్ పూర్తి చేసుకున్న అభ్యర్థులు దేశంలోని వివిధ విమానాశ్రయాల్లో ప్యాసింజర్ సర్వీస్ అసిస్టెంట్, బ్యాగేజ్ హ్యాండ్లింగ్ సర్వీస్, బిగ్ బడ్డీ తదితర విభాగాలలో నెలకు 18 వేల నుండి 25 వేల వరకు జీతం పొందే ఉద్యోగ అవకాశాలు పొందొచ్చని తెలియజేశారు. ఈ సువర్ణ అవకాశాన్ని పెద్దపల్లి జిల్లా కు చెందిన అర్హులైన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీ ఏ సాంబశివ రావు తెలియజేశారు.

కళాశాల ప్లేస్మెంట్ సెల్ అధ్యర్యంలో నిర్వహించిన ఈ డ్రైవ్ లో మొత్తం 65 మంది పాల్గొనగా డి. అక్షయ, చౌదరి శిరీష, అజ్మీరా కృష్ణవేణి, సాయి శ్రీజ, ఇషా ఫాతిమా, అఖిల మరియు కావ్యశ్రీ మొత్తం ఏడుగురు సెలెక్ట్ అయ్యారని ప్లేస్మెంట్ ఆఫీసర్ డా. జీ సుబ్బారావు, ఖాఖజ మెంటార్ పి. ఉషా రాణి తెలియజేశారు. ఇంకా సవిత, నివేదిత, డా. ఏ సురేష్, డా. సతీష్, శ్రీ ప్రసాద్ మొదలగు అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఏటూరునాగారంలోనే న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణ రాష్ట్రంలో న్యాయవ్యవస్థను మరింత విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం 200 కొత్త అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టుల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఏటూరునాగారం మండల కేంద్రంలో కొత్త న్యాయస్థానం ఏర్పాటు చేయాలని ఏటూరునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత కోరారు.ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కను, ఏటూరు నాగారం లోనే న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఏటూరునాగారం మండల కేంద్రానికి న్యాయస్థానం మంజూరు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఈనేపథ్యంలో ఏటూరునాగారం వంటి మారుమూల, గిరిజన ప్రాంతాలకు కూడా న్యాయ సేవలను మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందని సర్పంచ్ కాకులమర్రి శ్రీలత తన విజ్ఞప్తిలో పేర్కొన్నారు.ఏటూరునాగారం కేవలం ఒక మండల కేంద్రం మాత్రమే కాకుండా విస్తృతమైన గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు పరిపాలనా కేంద్రంగా ఉంది. మండలంలోని ప్రజలు తమ న్యాయపరమైన వ్యవహారాల కోసం ఇతర ప్రాంతాల్లోని కోర్టులను ఆశ్రయించాల్సి వస్తే ప్రయాణ ఖర్చులు, సమయం, రవాణా సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

అందుకే “న్యాయం ప్రజల వద్దకు రావాలి” అనే సూత్రంతో ఎటూరునాగారం మండల కేంద్రంలోనే న్యాయస్థానం ఏర్పాటు చేయాలని శ్రీలత కోరుతున్నారు.స్థానికంగా కోర్టు అందుబాటులోకి వస్తే ప్రజలకు న్యాయ సలహాలు, కేసుల దాఖలు, విచారణలకు హాజరు వంటి అంశాల్లో ప్రయాణ భారాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది. అదే సమయంలో స్థానిక న్యాయవాదులు, న్యాయ సేవా సంస్థలు, సంబంధిత పరిపాలనా వ్యవస్థకు కూడా మరింత సమన్వయం ఏర్పడే అవకాశం ఉంటుంది.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 200 కొత్త కోర్టుల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో, ఈ అవకాశాన్నిఏటూరునాగారం తాడువాయి మంగపేట కన్నాయిగూడెం వాజేడు వెంకటాపురం మండలాలకు ప్రజలకు ఉపయోగపడే విధంగా మలచాలని కాకులమర్రి శ్రీలత కోరారు.

## మహిళలు, బాలికలపై జరుగుతున్న
# దాడులను అరికట్టాలి

**కరీంనగర్ సెప్టెంబర్ 25: పెన్ పవర్:** భారత విద్యార్థి ఫెడరేషన్ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు మంకమ్మతోటలోని వాజేశ్వరి డిగ్రీ ఉమెన్స్ కళాశాలలో మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు.

స్ ఫ్ ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు శ్రీరాముల సంజన మాట్లాడుతూ.. 80 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో రోజురోజుకూ మహిళలకు రక్షణ కరువవుతోందని అన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నప్పటికీ అవి కేవలం కాగితాలకే పరిమితమవుతున్న పరిస్థితి దేశంలో కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు.దేశంలో ప్రతిరోజూ ఏదో ఒక చోట మహిళలు, బాలికలపై దాడులు జరుగుతున్నాయని, ఇటువంటి ఘటనలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వాలు మరింత కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇటీవల బీహార్‌లో మైనర్ బాలికపై జరిగిన దాడి, ఢిల్లీలో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలోని గోదావరిఖనిలో మహిళపై జరిగిన హత్య ఘటన కూడా కలవరపరిచిందన్నారు.

గత కొంతకాలంగా మహిళలు, బాలికలపై వరుసగా దాడులు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వాలు వాటిని అరికట్టేందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన “బేటీ బచావో.. బేటీ పడావో” నినాదం కేవలం ప్రచారానికే పరిమితం కాకుండా, మహిళలు మరియు బాలికలకు భద్రత కల్పించేలా ఆచరణలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే మహిళా రక్షణ చట్టాలను, సంబంధిత ప్రత్యేక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళా రక్షణ చట్టాలపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు.మహిళలకు, బాలికలకు భద్రత కల్పించే వరకు ఎాఖీ× నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాయకురాళ్లు రమ్య, శృతి, శిరీష, స్వాతి, శ్రీజ, తేజ, తేజస్విని, చరణ్య తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# సంక్షోభంలో విద్యుత్ రంగం

**హైదరాబాద్, సెప్టెంబర్ 25, పెన్ పవర్:** తెలంగాణలో విద్యుత్ రంగం మరోమారు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. రాష్ట్రంలోని కీలకమైన థర్మల్ పవర్ స్టేషన్లలో తలెత్తిన బొగ్గు కొరత, జల విద్యుత్ ఉత్పత్తిలో మందగమనం రేవంత్ రెడ్డిప్రభుత్వానికి పెను సవాల్‌గా మారుతున్నాయి. ఎన్నికల హామీల అమలుతో పాటు పారిశ్రామిక, వ్యవసాయ, గృహ అవసరాలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాల్సిన తరుణంలో ఈ పవర్ క్రైసిస్ సర్కార్‌కు తీవ్ర తలనొప్పిగా మారుతోంది.రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. మొత్తం 4వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈప్లాంట్‌లో బొగ్గు నిల్వలు లేకపోవడంతో కేవలం 800 మెగావాట్ల విద్యుత్ మాత్రమే ఉత్పత్తి అవుతోంది. దీనికి తోడు నాణ్యత లేని బొగ్గును వాడవలసి రావడం వల్ల ప్లాంట్‌లోని రెండు యూనిట్లలో తీవ్ర సాంకేతిక లోపాలు తలెత్తి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ నిబంధనల ప్రకారం.. ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ ఉత్పత్తి జరగాలంటే థర్మల్ ప్రాజెక్టులలో కనీసం 21రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉండాలి. అయితే, యాదాద్రి ప్లాంట్‌లో ప్రస్తుతమున్న నిల్వలు కేవలం మూడు నుంచి నాలుగు రోజులకు మాత్రమే సరిపోతాయని అధికారిక వర్గాలు చెప్తున్నాయి. దీన్నిబట్టి పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వ విధానాలపై ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. సింగరేణి కాలరీస్ వద్దతగినంత బొగ్గు నిల్వలు, బ్లాకులు అందుబాటులో లేకపోయినప్పటికీ, కేవలం జీ9 గ్రేడ్ బొగ్గును మాత్రమే వినియోగించే టెక్నాలజీతో యాదాద్రి ప్లాంట్‌ను ఎందుకు నిర్మించారని ప్రశ్నించారు. రాజకీయప్రయోజనాల కోసం తీసుకున్న ఈ నిర్ణయాల వల్లే రవాణా భారం పెరిగి, నేడు బొగ్గు కొరత ఏర్పడిందని అధికారులు సీఎం దృష్టికి



తెచ్చారు.మహానది కోల్ కీలిమిటెడ్, కోల్ ఇండియా నుంచి అదనంగా 5మిలియన్ టన్నుల బొగ్గును కేటాయించాల్సిందిగా ఆగస్టు నెలలోనే టీజీ జెన్కో కేంద్ర ప్రభుత్వానికి, కోల్ ఇండియాకు లేఖ రాసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని అధికారులు వెల్లడించారు.సెప్టెంబర్ చివరి నాటికి తగినంత బొగ్గును సమకూర్చుకోకపోతే మిగతా ప్రాజెక్టులు కూడా ఇదే దుస్థితిని ఎదుర్కొనే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కేంద్ర బొగ్గు శాఖ మంత్రికిషన్ రెడ్డిని కలిసి తక్షణమే బొగ్గును కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. దసరా పండుగ నాటికి యాదాద్రి ప్లాంట్‌లో పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలని స్పష్టం చేశారుమరోవైపు ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొనేందుకు రేవంత్ సర్కార్ దేశంలోని వివిధ బొగ్గు సరఫరాసంస్థలతో ముమ్మర చర్చలు జరుపుతోంది. ఏది ఏమైనప్పటికీ ఈ విద్యుత్ సంక్షోభాన్ని సమర్థవంతంగా అధిగమించడమే కాకుండా, భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ఎలాంటి శాశ్వత చర్యలు తీసుకుంటుందనేది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారింది.

# 22 ఏపై బ్యాక్ స్టెప్...




**హైదరాబాద్, సెప్టెంబర్ 25, పెన్ పవర్:** తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల వ్యవహారం ఇప్పుడు కేవలం రెవెన్యూ సమస్యగా కాకుండా.. రాజకీయంగా కూడా హాట్‌టాపిక్‌గా మారింది. సొంత భూములు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్లు జరగకఇబ్బందులు పడుతున్న బాధితుల ఆవేదనకు తోడు.. బీఆర్ఎస్, బీజేపీ సహా ప్రతిపక్షాల ఆందోళనలు, అసెంబ్లీలో రగడ, ప్రభుత్వంపై వచ్చిన ప్రశ్నలు ఈ వ్యవహారాన్ని మరింత వేడెక్కించాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం చర్చకు దారితీస్తోంది. ఇంతకాలం కఠినంగా ఉన్న ప్రభుత్వం.. ఇప్పుడు ఎందుకు సడలింపులు ప్రకటించింది? ప్రజా, రాజకీయ ఒత్తిడి పెరగడంతోనే వెనక్కితగ్గిందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.22ఏ జాబితాలో ఉన్న భూముల విషయంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో పెద్ద సంఖ్యలో ఆస్తి యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం గత

కొంతకాలంగా చర్చనీయాంశంగా ఉంది. ముఖ్యంగా ఇప్పటికే ప్రభుత్వ అనుమతులతో లేఅవుట్లు వేసుకుని ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి కూడా రిజిస్ట్రేషన్ సమస్యలు ఎదురయ్యాయి.ఈ సమస్యపైఅసెంబ్లీలో చర్చ జరిగిన సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి 22ఏ సమస్యకు పరిష్కారం చూపేందుకు 12 అంశాలతో కూడిన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. అనుమతులు ఉన్న లేఅవుట్లలో పెండింగ్‌రిజిస్ట్రేషన్లను పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించే విధానాన్ని తీసుకొస్తామని చెప్పారు. అంటే.. ఇంతకాలం 22ఏ జాబితాలో ఉందనే కారణంతో నిలిచిపోయిన ప్రతి ఆస్తిని ఒకే గాటన చూడకుండా,అనుమతులు ఉన్న లేఅవుట్లను ప్రత్యేకంగా పరిశీలించే దిశగా ప్రభుత్వం అడుగులు వేసినట్టయింది.ఈ అంశాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం మీద రాజకీయంగా పెద్ద ఎత్తున ప్రయోగించింది. 22ఏ జాబితాలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నేతలు జ్యుడీషియల్ విచారణ, వైట్‌పేపర్, నిషేధిత భూముల పూర్తి వివరాలను బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. 22ఏ బాధితులతో కేటీఆర్ సమావేశమైప్రభుత్వం భూ నిషేధిత జాబితాను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. ఇవి బీఆర్ఎస్ చేసిన ఆరోపణలు మాత్రమేనని, వాటిపై ప్రభుత్వం భిన్నమైన వివరణ ఇచ్చిందని గమనించాలి.అదే సమయంలో

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా 22ఏ అంశాన్ని ప్రతిపక్షాలు ప్రధాన అస్త్రంగా తీసుకున్నాయి. బీజేపీ ఎమ్మెల్యేలు కూడా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీలో నిరసనతెలిపారు.ఇది కేవలం అసెంబ్లీ గోడల మధ్యే ఆగలేదు. 22ఏ జాబితాలో తమ భూములు చిక్కుకోవడంతో రిజిస్ట్రేషన్లు జరగక ఇబ్బందులు పడుతున్న బాధితుల సమస్య కూడా బలంగా ముందుకొచ్చింది.ఒకవైపు ప్రతిపక్షాల విమర్శలు.. మరోవైపు భూముల యజమానుల ఆందోళనలు.. ఇంకోవైపు అసెంబ్లీలో వరుసగా చర్చలు జరగడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగిన వాతావరణం కనిపించింది. ఇదేసమయంలో బీఆర్ఎస్ నిరసనలకు సంబంధించిన పరిణామాలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వంతో ఆ పార్టీ మధ్య రాజకీయ ఘర్షణను మరింత తీవ్రతరం చేశాయి.ప్రభుత్వం మాత్రం దీనిని వెనక్కి తగ్గడంగాకాకుండా.. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే ప్రక్రియగా వివరిస్తోంది. 22ఏ వ్యవహారం అనేక రకాల భూములు, పాత రికార్డులు, కోర్టు వివాదాలు, ప్రభుత్వ భూములు, ప్రైవేట్ పట్టా భూములు,లేఅవుట్లు వంటి అంశాలతో ముడిపడి ఉందని ప్రభుత్వం చెబుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి కూడా కొన్ని సందర్భాల్లో మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ప్రైవేట్ భూముల యజమానులుఇబ్బందులు ఎదుర్కొన్నారని అసెంబ్లీలో వివరించారు.కానీ రాజకీయంగా చూస్తే మాత్రం మరో కథ వినిపిస్తోంది. బాధితుల నుంచి పెరుగుతున్న ఒత్తిడి.. బీఆర్ఎస్, బీజేపీ వంటి ప్రతిపక్షాల ఆందోళనలు..

అసెంబ్లీలో నిరంతర ప్రశ్నలు.. 22ఏ అంశంపై ప్రజల్లో పెరిగిన అసంతృప్తి నేపథ్యంలో ప్రభుత్వం పరిష్కార మార్గాన్ని వేగవంతం చేసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఒక సమస్యనుపరిష్కరించేందుకు కొత్త విధానం ప్రకటించిందా? లేక సమస్య తీవ్రత రాజకీయంగా పెరగడంతో నష్టనివారణ చర్యలకు దిగిందా? అనేది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగామారింది. ప్రభుత్వం చెప్పే లెక్కల ప్రకారం 22ఏ జాబితాలోని మొత్తం భూములన్నీ ప్రైవేట్ భూములు కావు. అటవీ, ప్రభుత్వ, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్, వివాదాస్పద భూములు కూడా అందులోఉన్నాయి. ప్రస్తుతం తీవ్రంగా చర్చకు వస్తున్నది ప్రైవేట్ పట్టా భూములకు సంబంధించిన సమస్య అని ప్రభుత్వం చెబుతోంది.అందుకే 22ఏ జాబితాలో ఉన్న ప్రతి భూమికి రిజిస్ట్రేషన్ అనుమతివచ్చేసిందని భావించడం కంటే.. చట్టబద్ధమైన ప్రభుత్వ అనుమతులు ఉన్న లేఅవుట్లు, వాస్తవంగా ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్న భూములు, వివాదాస్పద భూములను వేరు చేసి పరిష్కరించే ప్రక్రియమొదలైందని చూడటం కీలకం.బాధితులు తమ భూములపై హక్కు, రిజిస్ట్రేషన్ కోరుతున్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం పాత రికార్డులు, గత ప్రభుత్వాల నిర్ణయాలు,అధికారుల స్థాయిలో జరిగిన తప్పిదాలను ప్రస్తావిస్తూ పరిష్కార చర్యలను ప్రకటిస్తోంది.అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. 22ఏ సమస్యను ఇకపై పక్కన పెట్టే పరిస్థితి ప్రభుత్వానికిలేదు. సమస్యపై రాజకీయ వేడి పెరగడంతో పాటు ప్రజల నుంచి వచ్చిన ఒత్తిడి కూడా దీనిని ప్రభుత్వ అజెండాలో ముందుకు తెచ్చింది. ఎవీణూ, +ఎవీజ, ఋబూ వంటి సంస్థల ఆమోదం ఉన్నలేఅవుట్ల పెండింగ్ రిజిస్ట్రేషన్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రకటించిన చర్యలు అందులో భాగంగానే చూడవచ్చు.అందుకే ఇప్పుడు తెలంగాణలో వినిపిస్తున్న ప్రశ్న ఒక్కటే "22ఏపై మొదట ఇంత

కఠినంగా వ్యవహరించి.. చివరికి సడలింపులు ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది? ప్రజా ఆగ్రహం, ప్రతిపక్షాల పోరాటం, బాధితుల ఒత్తిడే ప్రభుత్వాన్ని ఈ నిర్ణయం వైపు నెట్టాయా?"దీనికి సమాధానం మాత్రంరాబోయే రోజుల్లో కొత్త మార్గదర్శకాలు, వాస్తవంగా ఎన్ని రిజిస్ట్రేషన్లు క్లియర్ అవుతున్నాయి, ఎంతమంది బాధితులకు ఉపశమనం లభిస్తోంది అన్నదానిపై ఆధారపడి ఉంటుంది.

## గులాబీ వ్యూహంతోనే కాంగ్రెస్...

**హైదరాబాద్, సెప్టెంబర్ 25, పెన్ పవర్:** తెలంగాణలో మరోసారి హైవోల్టేజ్ రాజకీయం నడుస్తోంది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీని వ్యూహాత్మకంగా దెబ్బతీసేందుకు, ఆ పార్టీ అగ్రనేతలను వారి సొంత గడ్డపైనే కట్టడి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డిపక్కా స్కెచ్ వేశారు. ఒకప్పుడు కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ ఇదే తరహా వ్యూహం అమలు చేసింది. ఇప్పుడు అదే వ్యూహాన్నే గులాబీ పార్టీపై అమలు చేసేందుకు సీఎం రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలపై సీఎం రేవంత్ ప్రత్యేకంగా కన్నేశారు.ఈ వ్యూహంలో భాగంగా ప్రతిపక్ష ముఖ్య నేతలను ఉక్కిరిబిక్కిరి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ వరుసబహిరంగ సభలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మొదట బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో ఈనెల 30న సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత వచ్చేనెల రెండో వారంలో హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేటలోనూ భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సర్వం సిద్ధమవుతోంది.ఈ రెండు నియోజకవర్గాల తర్వాత బీఆర్ఎస్అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ టార్గెట్‌గా రేవంత్ రెడ్డి పావులు కదుపుతున్నారు. కేసీఆర్ అసైన్డ్ భూముల లెక్కలు, గత ప్రభుత్వ హయాంలోని భూ ఆక్రమణలపై స్పష్టమైన లెక్కలు తేలాక, గజ్వేల్‌లో బహిరంగ సభను నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ ప్లాన్ చేస్తోంది. ఈ మూడు నియోజకవర్గాల్లో ముందుగా స్థానిక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి, ఆ తర్వాత పూర్తిస్థాయిలోరాజకీయ వ్యూహాన్ని అమలు చేయాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. కేవలం మాటల యుద్ధమే కాకుండా అభివృద్ధి పనులతో ప్రజల ముందుకు వెళ్లి, ఆపై ప్రత్యర్థులపై రాజకీయ దాడి పెంచాలనేది ప్రధానఉద్దేశంగా కనిపిస్తోంది.ఈ మూడు నియోజకవర్గాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు, బీఆర్ఎస్ అగ్రనేతలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు బలమైన కాంగ్రెస్ నేతలకు ఇక్కడ ప్రత్యేక బాధ్యతలుఅప్పగించనున్నారు. అభివృద్ధి ఎజెండాతో మొదలై ఫైనల్‌గా పూర్తిస్థాయి రాజకీయ వ్యూహంతో ముగిసేలా ఈ ప్రణాళికను అమలు చేస్తున్నారు.

## ప్రమాదకరంగా మారిన రోడ్డు మధ్యలో గుంతలు, పట్టించుకోని అధికారుల వైనం...

**రాజన్న సిరిసిల్ల: పెన్ పవర్:** బోయిన్పల్లి మండల కేంద్రం నుంచి కొదురుపాక కు వెళ్లే బ్రిడ్జి సమీపాన పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడం వల్ల ప్రజలు ప్రమాదానికి గురి కావలసిన పరిస్థితి పాలకుల , అధికారుల,నిర్లక్ష్యానికి ఏర్పడుతుంది. రోడ్లు భవనాల శాఖ అధికారులు ఆఫీసులకే పరిమితమవుతూ రోడ్ల మరమ్మత్తులకు పరిష్కారము చేపట్టడంలో ప్రజల భద్రత పట్ల , ప్రజలంటే లెక్క లేకుండా,పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు ఈ నిర్లక్ష్యాన్ని సిపిఎం పార్టీగా పూర్తిగా ఖండించడం జరుగుతుంది. ప్రమాదాలు జరుగుతే దీనికి పూర్తి బాధ్యత రోడ్ల భవనాల శాఖ అధికారులే బాధ్యత వహించాలని తెలియజేస్తూ,తక్షణమే రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని ప్రజల పక్షాన మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురజాల శ్రీధర్,అధికార యంత్రంగాన్ని డిమాండ్ చేయడం జరుగుతుంది.

## ఎన్నికలకు సిద్ధమౌతున్న కమలం




**హైదరాబాద్, సెప్టెంబర్ 25, పెన్ పవర్:** రాబోయే ఎమ్మెల్సీ, మున్సిపల్ ఎన్నికల పోరుకు బీజేపీ ఇప్పటినుంచే వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. రానున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు, 5 కీలక మున్సిపల్ కార్పొరేషన్లఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ సమాయత్తమవుతోంది. హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశం పార్టీ శ్రేణుల్లోసరికొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సమావేశానికి ఆయా మున్సిపల్ కార్పొరేషన్లు, ఎమ్మెల్సీ పరిధిలోని కీలక నేతలు హాజరై భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు.రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలుశరవేగంగా మారుతున్న వేళ, అర్బన్ ఓటర్లతో పాటు విద్యావంతులు, యువత బీజేపీ వైపు మొగ్గు చూపేలా పక్కా కార్యాచరణను పార్టీ సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో రెండు గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల్లో పార్టీక్యాడర్‌ను పూర్తిస్థాయిలో రంగంలోకి దించడం, క్షేత్రస్థాయిలో పార్టీ పట్టును మరింత బిగించడంపై విస్తృతంగా చర్చించారు. ఓటరు నమోదు ప్రక్రియ నుంచి పోలింగ్ బూత్ స్థాయి వరకు సమన్వయ లోపంలేకుండా ఒక పక్కా వ్యూహంతో ముందుకు సాగాలని రాంచందర్ రావు నాయకులకు దిశానిర్దేశం చేశారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ నాయకత్వం, కీలక నేతలకుబాధ్యతలు అప్పగించింది. వరంగల్- ఖమ్మం- నల్గొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎన్నికల బీజేపీ ఇన్‌ఛార్జ్‌గా ఎమ్మెల్సీ అంజిరెడ్డిని నియమించారు. హైదరాబాద్-మహబూబ్‌నగర్- రంగారెడ్డి పట్టభద్రులనియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా సీనియర్ నేత మల్కా కొమురయ్య బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నియోజకవర్గాల్లో విద్యావంతులు, ఉద్యోగులు, నిరుద్యోగ యువత సమస్యలను ప్రధాన ఎజెండాగా తీసుకునిపోరాటాలు చేయాలని నిర్ణయించారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి ఓటర్ల నమోదు అత్యంత కీలకమైన అంశం. దీన్ని గుర్తించిన బీజేపీ అధిష్ఠానం, ఈ నెల 27న హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ ఓట్ల నమోదుపైరాష్ట్ర స్థాయి ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించనుంది. ఈ రాష్ట్ర స్థాయి సదస్సు ముగిసిన వెంటనే, సంబంధిత నియోజకవర్గాల పరిధిలో జిల్లాల వారీగా వర్క్‌షాప్‌లు నిర్వహించి, ప్రతి గ్రామం, వార్డు స్థాయిలో

గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను ఉద్యమ రూపంలో చేపట్టాలని నిర్ణయించారు. కొత్తగా డిగ్రీ పూర్తి చేసిన యువతను, పట్టభద్రులను పెద్ద సంఖ్యలో ఓటర్లుగా చేర్పించడమే లక్ష్యంగా బూత్ స్థాయికమిటీలకు టార్గెట్లు నిర్దేశించనున్నారు.మరోవైపు పట్టణ ప్రాంతాల్లో పార్టీకి ఉన్న బలమైన ఓటు బ్యాంకును మరింత పటిష్టం చేసుకునే దిశగా 5 మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల కోసం ప్రత్యేక ఇన్‌ఛార్జ్‌లను

బీజేపీ నియమించింది. ఈ 5 కార్పొరేషన్ల పరిధిలో పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక కమిటీలు దృష్టి సారించనున్నాయి. వార్డు, డివిజన్, బూత్ స్థాయి కమిటీల పునర్వ్యవస్థీకరణ, స్థానిక ప్రజా సమస్యలపైఉద్యమాలు చేపట్టడం, ప్రజలతో నిరంతరం మమేకమయ్యేలా కార్యక్రమాలు రూపొందించడం ఈ కమిటీల ప్రధాన బాధ్యత.రాష్ట్ర నాయకత్వం నుంచి కింది స్థాయి కార్యకర్త వరకు పూర్తి సమన్వయంతో కదంతొక్కితేనే ఆశించిన ఫలితాలు సాధించగలమని సమావేశంలో స్పష్టం చేశారు. ఎన్నికల సమయానికి కాకుండా, ముందుగానే ఇన్‌ఛార్జ్‌లను రంగంలోకి దించడం, వర్క్‌షాప్‌ల ద్వారా శ్రేణులకు దిశానిర్దేశం

చేయడం చూస్తుంటే.. అటు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకోవడంతో పాటు ఇటు 5 కార్పొరేషన్లలో బలమైన శక్తిగా ఎదిగేందుకు బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతోందని స్పష్టమవుతోంది.

# చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాల కన్వీనర్‌గా పాతనబోయిన సంతోష్ కుమార్

**తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న జయంతి వేడుకలు**



**హైదరాబాద్, పెన్ పవర్ సెప్టెంబర్ 25:** తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ కన్వీనర్‌గా నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చలకుర్తి గ్రామానికి చెందిన పాతనబోయిన సంతోష్ కుమార్ రజక్‌ను నియమించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలు ప్రదర్శించి, దొరలకు ఎదురు నిలిచి, ఎందరో మహిళలకు స్ఫూర్తిగా నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు. మహిళ అంటే అబల కాదని, సబల అని నిరూపించి తెలంగాణ సమాజానికి స్ఫూర్తిని అందించిన మహనీయురాలు ఐలమ్మ అని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నందుకు తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు, పాలకవర్గానికి, ఉత్సవ కమిటీ చైర్మన్ దాసరి రాజు అజయ్ కుమార్‌కు సంతోష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. తనను గుర్తించి ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా నియమించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# శబరిమల సన్నిధిలో 'మహా పాదయాత్ర' బ్రోచర్ ఆవిష్కరణ

**ఇబ్రహీంపట్నం, పెన్ పవర్, సెప్టెంబర్ (25):** ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం నుంచి శబరిమల శ్రీ అయ్యప్ప స్వామి సన్నిధానం వరకు నిర్వహించనున్న 2026 మహా పాదయాత్రకు సంబంధించిన బ్రోచర్‌ను శబరిమల పవిత్ర సన్నిధిలో ఘనంగా ఆవిష్కరించారు. అజయ్ గురుస్వామి ఆధ్వర్యంలో వరుసగా 7వ సంవత్సరం నిర్వహించనున్న ఈ మహా పాదయాత్రను అక్టోబర్ 25న చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మాలధారణ అనంతరం శబరిమల పవిత్ర సన్నిధానంలో నిర్వహించిన కార్యక్రమంలో గౌరవనీయులైన మేల్శాంత్రి శ్రీ కుందుర్తి బ్రహ్మదత్త, ఈ.డి. ప్రసాద్ నంబూదిరి చేతుల మీదుగా మహా పాదయాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇదులకంటి గోపాల కృష్ణ గురుస్వామి, బాలరాజు స్వామి పాల్గొన్నారు.



శబరిమల సన్నిధిలో 'మహా పాదయాత్ర' బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం..

# కంటైనర్ స్కూలు ను ప్రారంభించిన మంత్రి సీతక్క

**ములుగు పెన్ పవర్:** ఏటూరునాగారం మండలం మామిడిగూడెం గ్రామంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ 15 లక్షల సి ఐ ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన కంటైనర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను రాష్ట్రపంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు. అనంతరంపాఠశాల విద్యార్థులతో మంత్రి సీతక్క ముఖాముఖిగా మాట్లాడి వారి చదువు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, షూస్ లను జిల్లా కలెక్టర్‌తోకలిసి మంత్రి సీతక్క పంపిణీ చేసి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా విద్యాశాఖాధికారి ఎ. సిద్ధార్థరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, ఉల్లాస్‌సమన్వయకర్త కృష్ణబాబు, మండల విద్యాధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సంబంధిత శాఖల అధికారులు, ఇతరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్లపై సర్కార్ ఉక్కుపాదం

**హైదరాబాద్, సెప్టెంబర్ 25, పెన్ పవర్:** మరోసారి ల్యాండ్ పాలిటిక్స్ తెరపైకి వచ్చాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కేటాయింపులు, రిజిస్ట్రేషన్లపై రేవంత్ రెడ్డి సర్కార్ ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైంది. మాజీ ముఖ్యమంత్రికేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సన్నిహితులకు భూబదలాయింపులపై సమగ్ర విచారణ జరిపేందుకు ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయికమిటీని ఏర్పాటు చేసింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పలు భూముల అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకుప్రభుత్వం ప్రత్యేక నిపుణుల బృందాన్ని రంగంలోకి దించింది. సాంకేతిక, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ ఎ. శ్రీదేవసేన చైర్‌పర్సన్ గా ఓ కమిటీని ఏర్పాటు చేసింది. స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక కార్యదర్శిరాజీవ్ గాంధీ హనుమంతు దీనికి కన్వీనర్ గా వ్యవహరించనున్నారు. జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో పాటు, ఏయే జిల్లాల పరిధిలోని భూములపై విచారణ జరుగుతుందో ఆయా జిల్లాలకలెక్టర్లు సభ్యులుగా ఉంటారు. తెలంగాణ అసెంబ్లీలో 22ఏ దుర్వినియోగం, నిషేధిత భూముల పరిధిపై జరిగిన వాడీవేడి చర్చ ఈ హైలెవల్ కమిటీ ఏర్పాటుకు ప్రధాన కారణమైంది. గత కేసీఆర్ ప్రభుత్వకాలంలో ప్రభుత్వ భూములు, సీలింగ్ మిగులు భూములు, అసైన్డ్ భూములు, జాగీర్, భూదాన్, ఇనామ్, అటవీ భూములతో పాటు చెరువులు, కుంటల పరివాహక ప్రాంతాల భూములను 22ఏ జాబితానుంచి నిబంధనలకు విరుద్ధంగా తొలగించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. మార్పిడి చేసి ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారన్న ఈ అంశంపై అసెంబ్లీలో పెద్ద ఎత్తున గందరగోళం చెలరేగడంతో, పరిపాలనాపరమైనచర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ విచారణ కమిటీకి రేవంత్ సర్కార్ విస్తృతమైన అధికారాలను కల్పించింది. సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, జయశంకర్ భూపాలపల్లి,రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని నిర్దేశిత గ్రామాల్లో చట్టాలు, జీఓలు, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనలను ఈ బృందం సవివరంగా పరిశీలిస్తుంది. ఒకవేళ అక్రమాలు జరిగినట్లు తేలితే, అందుకు బాధ్యులైనఅధికారుల నుండి రాజకీయ నాయకుల వరకు అందరి జవాబుదారీతనాన్ని ఖరారు చేసి తగిన చట్టపరమైన చర్యలను సిఫార్సు చేస్తుంది. ఈ విచారణకు సంబంధించి అన్ని రకాల భూ రికార్డులను వెంటనేసమర్పించాలని సంబంధిత జిల్లాల కలెక్టర్లు, సీసీఎల్ఏ, రిజిస్ట్రేషన్ శాఖలను ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది. గత ప్రభుత్వంలో అత్యంత కీలక పదవుల్లో కొనసాగిన అగ్రనేతలు, వారి బంధువులు,అనుచరులతో ముడిపడి ఉన్న భూములే లక్ష్యంగా చేసుకుని ఈ విచారణ సాగుతుండటం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఈ ఎంక్వైరీ కమిటీ పరిణామాలు అధికార కాంగ్రెస్, ప్రతిపక్షబీఆర్ఎస్ మధ్య రాబోయే రోజుల్లో తీవ్ర రాజకీయ యుద్ధానికి దారితీసే సూత్రాలు కనిపిస్తున్నాయి. కమిటీ ఇచ్చే నివేదికల ఆధారంగా ప్రభుత్వం తీసుకోబోయే తదుపరి చర్యలు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంతకీలకంగా మారనున్నాయి.

# రూ.39 లక్షలకు బాలాపూర్ లడ్డూ.. రుచి కంటే నమ్మకమే ఎక్కువ.. ఎందుకంత డిమాండ్?



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరం భక్తిభావంతో మైమరచిపోయే వేళ.. వినాయక చవితి వేడుకలకు వేదికైన బాలాపూర్ ప్రతి ఇంటా ఒక ప్రత్యేక సెంటిమెంట్‌ను రగిలిస్తుంది. బాలాపూర్ గణనాథుడి దివ్య రూపం, శోభాయాత్ర ఎంతటి కోలాహలాన్ని తెస్తాయో.. ఆ స్వామి వారి ప్రసాదమైన 'బాలాపూర్ లడ్డూ' వేలం పాట కూడా అంతే ఉత్కంఠను రేకెత్తిస్తుంది. భక్తికి, నమ్మకానికి, తరతరాల సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే ఈ వేలం పాట.. ఏటా సరికొత్త చరిత్రను తిరగరాస్తూ దేశవ్యాప్తంగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

ఈ ఏడాది కూడా అదే ఉత్కంఠ.. అదే భక్తి ప్రపత్తుల నడుమ బాలాపూర్ లడ్డూ వేలం ముగిసింది. 21 కిలోల ఈ పవిత్ర లడ్డూ ప్రసాదం ఏకంగా రూ.39 లక్షలకు అమ్ముడైంది. అర్బన్ గ్రూప్‌కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి అత్యధిక ధర చెల్లించి లడ్డూను సొంతం చేసుకున్నారు. గతేడాది రూ.35 లక్షలు పలికిన లడ్డూ.. ఈసారి మరో రూ.4 లక్షలు పెరిగి.. గణపతి నమ్మకానికి ఉన్న విలువను మరోసారి చాటిచెప్పింది.

**రూ.450తో మొదలై.. రూ.39 లక్షల శిఖరానికి..**

బాలాపూర్ లడ్డూ వేలం వెనుక మూడు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణం ఉంది. 1994లో మొదటిసారిగా ప్రారంభమైన ఈ వేలం పాటలో లడ్డూ కేవలం రూ.450కే అమ్ముడైంది. నాటి చిన్న ప్రారంభం.. ఈనాడు కోట్లాది మంది ఆసక్తిగా ఎదురుచూసే ఒక అద్భుత ఘట్టంగా మారింది. రూ.450 నుంచి ప్రారంభమై.. ఏటా భక్తుల నమ్మకంతో రూ.39 లక్షల మైలురాయిని చేరుకోవడం కేవలం ఒక వేలం పాట మాత్రమే కాదు.. అది తెలుగు నేలపై వెల్లివిరుస్తున్న భక్తి మైత్రికి నిదర్శనం.

**భాషా కోర్సులు నేర్చుకోండి**

వ్యాపార ప్రముఖుల పోటీ.. సరిహద్దులు దాటిన విశ్వాసం ఈ ఏడాది వేలం పాట పోటీలో నిలిచేందుకు 9 మంది భక్తులు ముందుకు రాగా అందులో 5 ప్రముఖ కంపెనీలు ఉండటం విశేషం. మర్రి రవికిరణ్ రెడ్డి, కందాడ శాలిని వీరేందర్ రెడ్డి, కంచర్ల శివా రెడ్డి, సామ దయానంద్ రెడ్డి, సామ వరణంద్ రెడ్డి (లండన్), గడ్డం నవీన్ రెడ్డి, శ్రీకాంత్, ఇబ్రాం ప్రత్యూష్ వంటి పలువురు పోటీ పడ్డారు. చివరికి సామ ప్రణీత్ రెడ్డి రూ.39 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు.

కేవలం స్థానికులే కాదు.. విదేశాల్లో స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐలు సైతం ఈ వేలంలో పాల్గొనేందుకు వేల కిలోమీటర్ల దూరం నుంచి బాలాపూర్ నేలకు చేరుకోవడం ఇక్కడి సంప్రదాయ బలాన్ని తెలుపుతుంది.

**వేలం వెనుక వెలకట్టలేని నమ్మకం**

బాలాపూర్ లడ్డూను దక్కించుకున్న వారికి గణపయ్య దివ్య ఆశీస్సులు లభిస్తాయని.. ఇంటా బయటా సుఖసంతోషాలు, అష్టఐశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల దృఢమైన విశ్వాసం. "ఈ లడ్డూ ధర రూ.39 లక్షలు కావచ్చు.. కానీ దాని వెనుక ఉన్న భక్తి, నమ్మకం, స్వామివారి అనుగ్రహం వెలకట్టలేనివి." అని కొన్న వారు అంటుంటారు. సమాజంలో హోదా, సాంస్కృతిక ముద్ర, లంబోదరుడిపై ఉన్న అపరిమితమైన విశ్వాసమే భక్తులను ఈ వేలంలో కోట్లు వెచ్చించేలా చేస్తోంది.

**సాగరం వైపు సాగిన శోభాయాత్ర**

లడ్డూ వేలం ముగియగానే బాలాపూర్‌లో ఆనంద హేల మొదలైంది. 'గణపతి బప్పా మోరియా' జయజయధ్వనాల మధ్య శోభాయాత్ర ప్రారంభమైంది. భక్తుల కోలాహలం, డప్పు దరువుల నడుమ బాలాపూర్ గణనాథుడు హుస్సేన్‌సాగర్ నిమజ్జనానికి పయనమయ్యాడు. ఒక చిన్న ప్రసాదంగా మొదలై.. కోట్లాది మంది గుండెల్లో భక్తి పరవశాన్ని నింపే సాంస్కృతిక పండుగలా మారిన బాలాపూర్ లడ్డూ వేలం, ఏటికేడాది తన ప్రత్యేకతను కాపాడుకుంటూ సరికొత్త అధ్యాయాలను లిఖిస్తూనే ఉంది!

# లక్షల లడ్డూ.. ట్యాక్స్ కన్ను! భక్తితో పాడుతున్నారా? ఐటీ ముప్పు కొనితెచ్చుకుంటున్నారా?



**హైదరాబాద్ పెన్ పవర్:** గణపతి బప్పా మోరియా.. అంటూ వినాయక చవితి వేడుకల్లో భక్తులు పోటీపడి పాడుతున్న లడ్డూ వేలం ఇప్పుడు ట్రెండింగ్ మాత్రమే కాదు.. కోట్లకు పడగెత్తుతున్న ప్రతిష్టాత్మక వ్యవహారం.. భక్తి, నమ్మకం, పాజిటివ్ వైబ్స్ కోసం లక్షలు గుమ్మరించి ప్రసాదాన్ని ఇంటికి తెచ్చుకోవడం వరకు బాగానే ఉంది.. కానీ ఆ వేలం పాట ముగిశాక ఇన్ కం ట్యాక్స్ ఆఫీసర్ల నుంచి ఫోన్ వస్తే ఏం చేస్తారు? భక్తికి హద్దులు లేవు సరే.. మరి మీరు లడ్డూ కోసం చెల్లించిన లక్షలకు సరైన లెక్కలు ఉన్నాయా? 'లడ్డూ కొంటే పన్ను పడుతుందా? 80జీ కింద మినహాయింపు దక్కుతుందా?' అనే అంశంపై ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అసలు పన్ను లెక్కలు ఇవే!

వినాయక చవితి ఉత్సవాలు ముగిసే సమయానికి తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా వినిపించే మాట 'లడ్డూ వేలం'. ఒకప్పుడు వందలు.. వేలల్లో సాగిన గణపతి లడ్డూ వేలం ఇప్పుడు లక్షలు దాటి కోట్ల రూపాయలకు చేరుతున్న సందర్భాలు ఉన్నాయి. భక్తి, సెంటిమెంట్, ప్రతిష్ఠ, స్వామివారి ప్రసాదాన్ని ఇంటికి తీసుకెళ్లాలనే నమ్మకం.. ఇలా ఎన్నో కారణాలతో భక్తులు భారీ మొత్తాలకు వేలం పాడుతున్నారు. అయితే లక్షలు చెల్లించి లడ్డూను దక్కించుకున్న వ్యక్తికి పన్ను పరంగా ఏమైనా ఇబ్బందులు వస్తాయా? అసలు వేలంలో చెల్లించిన మొత్తాన్ని ఆదాయంగా పరిగణిస్తారా? 80జీ కింద పన్ను మినహాయింపు పొందొచ్చా? అనే సందేహాలు ఇప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

**డిక్షనరీలు శోధించండి**

లడ్డూ కొంటే ఆదాయ పన్ను పడుతుందా?

సాధారణంగా లడ్డూను వేలంలో కొనుగోలు చేసి దానికి ఒక మొత్తాన్ని చెల్లించడం.. ఆ మొత్తాన్ని కొనుగోలుదారుడి ఆదాయంగా పరిగణించడం ఒకటే విషయం కాదు. ముఖ్యంగా ఇన్ కం ట్యాక్స్ యాక్ట్ లోని సెక్షన్ 56(2)(ఎక్స్) అనేది ప్రధానంగా ఒక వ్యక్తికి డబ్బు లేదా కొన్ని రకాల ఆస్తి ఉచితంగా లేదా నిర్దేశిత పరిస్థితుల్లో తక్కువ విలువకు లభించిన సందర్భాలను నియంత్రిస్తుంది. అందువల్ల "రూ.50 వేలకు పైగా లడ్డూ వేలం పాడితే ఆ మొత్తానికే 56(2)(ఎక్స్) కింద పన్ను" అనే సింపుల్ ఫార్ములా వర్తించదు. అయితే ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఉంది. వేలం మొత్తం ఎక్కడి నుంచి వచ్చింది? ఎలా చెల్లించారు? దానికి సరైన ఆర్థిక ఆధారం ఉందా? అన్నది పెద్ద మొత్తాల విషయంలో ముఖ్యంగా మారుతుంది.

**80జీ ఉంటే పన్ను మినహాయింపు వస్తుందా?**

లడ్డూ వేలం మొత్తాన్ని 'డొనేషన్'గా చూపించి 80జీ కింద మినహాయింపు పొందాలంటే కేవలం ఆ మొత్తాన్ని దేవాలయం లేదా గణేష్ ఉత్సవ కమిటీకి చెల్లించడం సరిపోదు. ఆ మొత్తాన్ని స్వీకరిస్తున్న సంస్థ సెక్షన్ 80జీ కింద అర్హత పొందిన సంస్థగా ఉండాలి. అర్హత ఉన్న సంస్థలకు ఇచ్చే విరాళాలపై 50 శాతం లేదా 100 శాతం వంటి వివిధ రకాల డిడక్షన్ లు నిబంధనల ఆధారంగా ఉంటాయి. అలాగే 80 జీ కింద నగదు విరాళాలకు రూ.2,000 పరిమితి ఉంది. అంటే ప్రతి గణేష్ ఉత్సవ కమిటీకి 80జీ ఉంటుందని భావించడం సరికాదు.

**అసలు కీలకమైన ప్రశ్న ఇదే..**

ఒక వ్యక్తి రూ.10 లక్షలు, రూ.20 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ మొత్తానికి లడ్డూను వేలంలో దక్కించుకున్నాడనుకుందాం. ఈ డబ్బు చెల్లించడానికి అతని వద్ద చట్టబద్ధమైన ఆదాయ వనరు ఉండాలి. జీతం, వ్యాపార ఆదాయం, గతంలో ఉన్న పొదుపులు, బ్యాంకు లావాదేవీలు వంటి వాటికి సరైన ఆధారాలు ఉంటే పెద్ద మొత్తంలో చెల్లింపు చేయడం మాత్రమే పన్ను సమస్యకు కారణం కాదు. కానీ ఆదాయానికి సరైన లెక్కలు లేకుండా భారీ మొత్తాలను ఖర్చు చేస్తే పన్ను అధికారులు ఆ డబ్బు మూలంపై వివరణ కోరే అవకాశం ఉంటుంది.

**వేలం పాడే ముందు ఏం చూసుకోవాలి?**

లడ్డూ వేలంలో భారీ మొత్తానికి బిడ్ చేసే వ్యక్తులు కొన్ని విషయాలను ముందుగానే పరిశీలించడం మంచిది. చెల్లింపు బ్యాంకింగ్ మార్గంలో చేయడం.. వేలం రసీదు తీసుకోవడం.. ఉత్సవ

కమిటీ/సంస్థ చట్టబద్ధమైన స్థితిని తెలుసుకోవడం..80జీ గుర్తింపు ఉందా లేదా పరిశీలించడం.. 80జీ డిడక్షన్ కోసం అవసరమైన ధ్రువపత్రాలు ఉన్నాయా చూడడం ముఖ్యం. చెల్లిస్తున్న మొత్తం తనకు వచ్చిన చట్టబద్ధమైన ఆదాయంతో సంబంధం ఉన్నట్లు రికార్డులు ఉంచుకోవడం చాలా చాలా ముఖ్యం. 80జీ కింద అర్హత ఉన్న సంస్థలు విరాళాల వివరాలను ఆదాయ పన్ను శాఖకు సమర్పించి.. అర్హత ఉన్న దాతలకు సంబంధిత డొనేషన్ సర్టిఫికెట్ ఇవ్వాల్సిన విధానం కూడా ఉంది.

**భక్తికి ధర ఉండదు.. కానీ డబ్బుకు లెక్క ఉండాలి..**

లడ్డూ వేలంలో లక్షలు పెట్టడం భక్తి, విశ్వాసం, సెంటిమెంట్‌తో ముడిపడి ఉంటుంది. వేలంలో గెలిచిన వ్యక్తికి ఆ లడ్డూ కేవలం ప్రసాదం కాకుండా ఒక విశ్వాసానికి ప్రతీకగా భావించవచ్చు. అయితే పన్ను చట్టాల దృష్టిలో మాత్రం భావోద్వేగాల కంటే లావాదేవీ స్వరూపం, డబ్బు మూలం, చెల్లింపు విధానం, అందుకున్న రసీదు, సంస్థకు ఉన్న పన్ను అర్హతలు వంటి అంశాలకే ప్రాధాన్యం ఉంటుంది. అందుకే "లడ్డూ కోసం ఎంతైనా పెడతాం" అని వేలంలో బిడ్ చేసే ముందు.. "ఈ మొత్తానికి నా దగ్గర లెక్క ఉందా?" అనే ప్రశ్న కూడా వేసుకోవడం మంచిదే.

# కొమ్మాది ప్రాంతంలో కలెక్టర్ పర్యటన

**హైదరాబాద్ పెన్ పవర్:** విశాఖలో కొమ్మాది ప్రాంతంలో కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పర్యటించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా కొమ్మాది కార్పెంటర్ కాలనీలో పర్యటించి సంబంధిత బాధితులతో మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలోభాదితులకు ఆదుకునేలా అన్నీ విదాలుగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అనంతరంమధురవాడలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ బాయ్స్ హాస్టల్‌ను సందర్శించారు. ఈసందర్భంగా హాస్టల్‌లోని వసతి, భోజనం, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హాస్టల్‌లోని ఒక చిన్నారి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. స్టడీ అవర్‌లో విద్యార్థులతో కలెక్టర్ ప్రత్యేకంగా ఇంటరాక్ట్ అయ్యారు. వారి చదువులు, భవిష్యత్ లక్ష్యాలు, ఆసక్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడి, వారి సందేహాలను తెలుసుకున్నారు.

# జగన్ లో కొత్త ఆందోళన



**విశాఖపట్టణం, సెప్టెంబర్ 25, పెన్ పవర్:** ఓటమి ఇచ్చిన గాయం కంటే, రానున్న రోజుల్లో చుట్టుముట్టబోయే చట్టపరమైన ఉచ్చులే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలో ఆందోళనను రేకెత్తిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల ఆయన అడుగులు, ప్రసంగాలు, ఆకస్మిక కార్యాచరణలను నిశితంగా పరిశీలిస్తే ఆ అంతర్గత కంగారు స్పష్టంగా బయటపడుతోంది. నిరుద్యోగులను రెచ్చగొట్టేందుకు డీఎస్సీ క్రీడా కోటాపై ఆధారాల్లేని ఆరోపణలు గుప్పించడం, ఏ చిన్న అవకాశాన్ని వదలకుండా హుటాహుటిన రాజ్ భవన్‌కు పరుగులెత్తి గవర్నర్‌కు వినతిపత్రాలు సమర్పించడం వంటివి ఆయన కంగారును చూపిస్తున్నాయి.ఏపీలో గత ఐదేళ్ల పాలనలో సాగిన భారీ లిక్కర్ సిండికేట్ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శరవేగంగా పావులు కదుపుతోంది. ఢిల్లీ మద్యం కుంభకోణాన్ని మించిన రీతిలో సాగిన నగదు లావాదేవీలు, డిస్టిలరీల బెదిరింపులు, ప్రత్యేక బ్రాండ్ల ముసుగులో జరిగిన దోపిడీకి సంబంధించిన మనీ ట్రయల్స్ చిక్కుముడులను దర్యాప్తు సంస్థలు పక్కా ఆధారాలతో ఛేదించినట్లు ఢిల్లీ వర్గాల సమాచారం. దర్యాప్తు పరిధి విస్తరిస్తున్న కొద్దీ తాడేపల్లి కీలక చక్రాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.ఈ మొత్తం వ్యవహారంలో జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా, తెరవెనుక ఆర్థిక లావాదేవీలను పర్యవేక్షించినట్లు ప్రచారంలో ఉన్న ఆయన సమీప బంధువు అనిల్ రెడ్డి పాత్రపై దర్యాప్తు సంస్థల నిఘా మరింత కఠినతరమైంది. లిక్కర్ స్కామ్‌లో ముడుపుల సేకరణ, వాటిని హవాలా మార్గాల్లోకి మళ్లించడం వెనుక కీలక సూత్రధారిగా భావిస్తున్న అనిల్ రెడ్డిని ఈడీ ఏ క్షణమైనా అదుపులోకి తీసుకునే అవకాశముందన్న గుసగుసలు తారాస్థాయికి చేరాయి. ఒకసారి సూత్రధారులు పట్టుబడితే దర్యాప్తు సెగ నేరుగా అధినేత ద్వారాలనే తాకుతుందని జగన్‌కు స్పష్టంగా అర్థమైపోయింది. అందుకే గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకవైపు మీడియా సమావేశాల్లో దూకుడు ప్రదర్శిస్తూనే, మరోవైపు తీవ్ర నైతిక రక్షణలోకి వెళ్లే పరిస్థితి తలెత్తింది.ఇదే సమయంలో ఆయన బెంగళూరు ప్యాలెస్ కేంద్రంగా సాగుతున్న రహస్య మంతనాలు సరికొత్త రాజకీయ చర్చకు తెరలేపాయి. తన ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీ తరపున రాజ్యసభకు పంపిన రిలయన్స్ గ్రూప్ కీలక ప్రతినిధి పరిమళ్ నత్వానీ ఇటీవల బెంగళూరులో ఓ వివాహ వేడుకకు హాజరైనప్పుడు.. జగన్ ఆయనను ప్రత్యేకంగా తన నివాసానికి ఆహ్వానించి ఏకాంత చర్చలు జరిపారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో సత్సంబంధాలు, ఢిల్లీ రాజకీయాల్లో విస్తృత పలుకుబడి ఉన్న పరిమళ్ నత్వానీతో జగన్ ఏం మాట్లాడి ఉంటారనేది ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. కేసులు ముంచుకొస్తున్న వేళ ఢిల్లీ స్థాయిలో రాయబారాలు నడిపి రక్షణ పొందడానికే ఈ ఆకస్మిక లంచ్ డిప్లొమసీని ఉపయోగించుకున్నారు.ఒకవైపు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు, పోలవరం పనుల పునరుద్ధరణ, రాజధాని నిర్మాణాలతో ముందుకెళ్తుంటే.. మరోవైపు జగన్ మాత్రం పాత స్క్రిప్టులు వల్లెవేస్తూ, కల్పిత ఆరోపణలతో కాలం వెళ్లదీస్తున్నారు. పచ్చి అబద్ధాలతో ప్రజలను నమ్మించలేమని తెలిసినప్పటికీ, కేసుల నుంచి ప్రజా దృష్టిని మరల్చడానికి ఆయన చేస్తున్న ఈ ఆపసోపాలు సొంత కేడర్‌లోనే నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తున్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థల దూకుడు, అనిల్ రెడ్డి చుట్టూ బిగుస్తున్న ఉచ్చు, బెంగళూరు రహస్య భేటీలు.. ఇవన్నీ జగన్ రాజకీయ భవితవ్యం తీవ్ర సంక్షోభంలో పడిందనడానికి ప్రత్యక్ష నిదర్శనాలుగా నిలుస్తున్నాయివైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నేతలను పిలిపించుకుని ప్రసంగించారు. ఎప్పుడూ చెప్పే మాటలే చెప్పారు. కూటమి ప్రభుత్వంపై అడ్డగోలు విమర్శలు గుప్పించడంతో పాటు.. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులన్నింటినీ గతంలో తామే చేసేశామని, భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి అదానీ డేటా సెంటర్ దాకా అన్నీ తమ ఘనతేనంటూ ఆయన చెప్పుకున్నారు. విశాఖకు ఐటీ కంపెనీలను తరిమేసి, రుషికొండను బోడిగుండు చేసి విలాసవంతమైన ప్యాలెస్ నిర్మించుకున్న ఘన చరిత్రను ప్రజలు ఇంకా మరువకముందే.. తానేదో నగరాన్ని ఉద్ధరించేశానని జగన్ చెప్పుకోవడం విడ్డూరంగా మారింది. తన ఐదేళ్ల పాలనలో ఉత్తరాంధ్రకు రాజధాని ముసుగులో భూకబ్జాలు, గంజాయి దందాలు తప్ప చేసిందేమీ లేదు. అయినా మేం చేసిన అభివృద్ధి కళ్ల ముందే ఉందని చెప్పుకున్నారు.అన్నింటికంటే పరాకాష్ట ఏమిటంటే.. “మా హయాంలో పోలీసులను వాడుకోలేదు, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయలేదు” అంటూ జగన్ చెప్పుకోవడంఅయిదేళ్ల పాటు ప్రత్యర్థి పార్టీల నేతలపై అక్రమ కేసులు, సీఐడీ వేధింపులు, అర్ధరాత్రి అరెస్టులు, ప్రతిపక్ష గొంతు నొక్కేందుకు పోలీసు బలగాలను సొంత ప్రైవేటు సైన్యంగా మార్చుకున్న తీరు యావత్ దేశానికే తెలుసు. అలాంటి వ్యక్తి నేడు పోలీసులపై నిందలు వేస్తూ.. అధికారుల పేర్లను డిజిటల్ డైరీ లో రాసి పెట్టుకోవాలని, మూడేళ్ల తర్వాత తమ ప్రభుత్వం రాగానే సినిమా చూపిస్తామని కేడర్‌ను బహిరంగంగా రెచ్చగొట్టడం ఆయన హింసాత్మక రాజకీయ మనస్తత్వాన్ని తేటతెల్లం చేస్తోంది. వినేవాళ్లు, గుడ్డిగా నమ్మేవాళ్లు ఉంటే జగన్ రెడ్డి ఎలాంటి కట్టుకథలైనా చెబుతారనేందుకు ఆయన ప్రసంగమే సాక్ష్యం.రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో కేడర్‌లో నైతిక స్థైర్యం నశించిందని గ్రహించిన జగన్.. లేని గెలుపును ఊహించుకుంటూ కార్యకర్తలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కానీ వారేమీ వేరే గ్రహం నుంచి రాలేదు కదా.. జగన్ రెడ్డి పాలన చేసినప్పుడూ వారు ఉన్నారు. తెలియకుండా ఉంటుందా?

# మంత్రి నాదెండ్ల కోటలో రాజకీయం ఎలా ఉంది..?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెనాలి నియోజకవర్గంలోని మండలాల పరిధిలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తరఫున జనసేన పార్టీ ప్రాతినిధ్యం వహిస్తుండగా, రాజకీయాల్లో జోరు కనిపిస్తోంది. ఇదే సమయంలో వైసీపీలో నాయకుల లేమి, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుల వ్యవహారం బేజారుగా మారింది. గతంలో కేవలం తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ మధ్యే సాగిన ప్రధాన పోటీ, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన సీనియర్ నాయకుడు నాదెండ్ల మనోహర్ రంగ ప్రవేశంతో త్రిముఖ పోరుగా మారి, చివరకు కూటమి విజయం సాధించింది.ప్రస్తుతం తెనాలి టౌన్, తెనాలి రూరల్, కొల్లిపర మండలాల పరిధిలో తాజా రాజకీయ సమీకరణాలు మారుతున్నా యి. ఇవి కూటమికి అనుకూలంగా ఉన్నాయి. కూటమి నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ నాయకత్వంలో శ్రేణులు జోరుమీదున్నారు. మనోహర్ నియోజకవర్గంలో పట్టు సాధించేందుకు నిరంతరం పర్యటిస్తున్నారు. అభివృద్ధి పనులపై దృష్టి పెట్టారు. ఇటీవల కాలంలో నియోజకవర్గ పరిధిలోని తాగునీటి సమస్యల పరిష్కారానికి, రహదారుల నిర్మాణాలకు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ మౌలిక వసతుల కల్పనపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది.

గతంలో ఇక్కడి నుంచి పోటీ చేసిన టీడీపీ స్థానిక నేతలు, జనసేన శ్రేణులతో కలిసి సమన్వయంతో ముందుకు వెళు _న్నారు. వైసీపీ విషయానికి వస్తే.. కేంద్ర కార్యాలయం చేరువగానే ఉన్నా.. నియోజకవర్గంపై పట్టు సాధించక పోవడం గమనార్హం. గత ఎన్నికల్లో ఓటమి చెందిన మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఇతర ముఖ్య నాయకులు నియోజకవర్గంలో కార్యక్రమాలకు ముక్తసరిగా హాజరవుతున్నారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలాల వ్యాప్తంగా ద్వితీయ శ్రేణి నాయకులు అలర్ట్ అవుతున్నారు. వార్డులు, గ్రామాల పరిధిలో పట్టు నిలుపుకోవడానికి అధికార కూటమి అంతర్గత వ్యూహాలు రచిస్తుండగా, వైసీపీ మాత్రం తిరిగి పుంజుకోవడానికే పరిమితం అవుతోంది. మొత్తంగా చూస్తే, తెనాలి టౌన్, రూరల్ మండలాల పరిధిలో ప్రస్తుతం అధికార పక్షం అభివృద్ధి మంత్రంతో ప్రజల్లోకి వెళ్తుండగా, ప్రతిపక్షం మాత్రం కేడర్‌పై వస్తున్న కేసులను ఎదుర్కొంటూ రాజకీయ ఉనికి కోసం ప్రయాస పడుతోంది.

# పయ్యావుల కేశవ్.. కాసుల కుస్తీ.. !



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా పయ్యావుల కేశవ్ పనితీరుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2024 జూన్ లో ఆయన బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి, రాష్ట్ర ఆర్థిక రంగాన్ని గాడిలో పెట్టేందుకు, కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నిధులు సమకూర్చేందుకు ఆయన నిరంతరం శ్రమిస్తున్నారు. బడ్జెట్ నిర్వహణ విషయంలో ఆయన ఆపశోపాలు పడుతున్నారన్నది వాస్తవం. వైసీపీ ప్రభుత్వ హయాం నాటి ఆర్థిక ఇబ్బందుల నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు ఆయన ప్రణాళికలు రచిస్తున్నారు.

2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆయన రూ. 3.32 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు, ఇది వ్యవసాయం, సంక్షేమం మరియు పెట్టుబడుల వృద్ధికి ప్రాధాన్యతనిచ్చేలా రూపొందించారు. మరోవైపు కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, నీతి ఆయోగ్‌తో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ, రాష్ట్రానికి రావలసిన నిధులు, ప్రాజెక్టుల సాధనలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. 'వికసిత భారత్ 2047' వంటి విజన్ కార్యక్రమాల్లో రాష్ట్ర ఆర్థిక నమూనాలపై కేంద్రంతో చర్చిస్తున్నారు.

బ్యాంకర్లతో సమన్వయం: రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశాల్లో పాల్గొంటూ రైతులకు, చిన్న వ్యాపారులకు తగినంత రుణ సదుపాయం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల 3,000 కోట్ల రూపాయల క్రెడిట్ అవుట్‌రీచ్‌ను అందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అయితే ఈ పనుల ఒత్తిడి కారణంగా ఫైళ్ల పరిష్కారంలో జాప్యం పెరిగిపోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారు. అంతర్గత సమీక్షలో ప్రభుత్వ ఫైళ్ల క్లియరెన్స్‌లో పయ్యావుల కేశవ్ ఆఖరి స్థానంలో నిలిచినట్లు నివేదికలు వచ్చాయి.ఆర్థిక శాఖ అత్యంత కీలకమైనది కావడంతో, ప్రతీ ఫైల్‌ను కూలంకషంగా పరిశీలించడం వల్లే ఈ జాప్యం జరుగుతోందనే అభిప్రాయం కూడా ఉంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఆర్థిక అవకతవకలను, స్కామ్‌లను ఎండగట్టడంలో పయ్యావుల దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో వైసీపీ నాయకులు ఆయనపై, ఆయన కుటుంబ నేపథ్యంపై రాజకీయ విమర్శలు గుప్పిస్తున్నారు. వీటిని సమర్థంగా తిప్పి కొట్టలేక ఇబ్బంది పడుతున్నది వాస్తవం. ఇక, క్షేత్రస్థాయిలో ఉరవకొండ నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటున్నా.. ఆశించిన మేరకు సమయం కేటాయించలేక పోతున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ రూట్ మ్యాప్

**విజయవాడ, సెప్టెంబర్ 25, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ప్రవాహం, పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జాతీయ స్థాయిలో సరికొత్త ఎజెండాను బలంగా వినిపిస్తున్నారు. ఢిల్లీ వేదికగా పారిశ్రామికవేత్తలు, విధాన నిర్ణేతలతో పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫైర్‌సైడ్ చాట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి రోడ్‌మ్యాప్‌ను వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దశాబ్దాలుగా అమలు చేస్తున్న సమర్థవంతమైన పాలనా నమూనాను గుర్తుచేస్తూ.. పని, జవాబుదారీతనం, నాణ్యమైన సేవలు అనే మూడు మూలస్తంభాలపైనే తమ ప్రభుత్వం నడుస్తోందని స్పష్టం చేశారు. ఒకప్పుడు ప్రపంచమంతా మాట్లాడిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దశ దాటిపోయిందని, ఆధునిక పోటీ ప్రపంచంలో వేగమే సర్వస్వమని, అందుకే కూటమి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను తమ అధికారిక పాలనా సంస్కృతిగా మార్చుకుందని లోకేష్ ప్రకటించారు.పరిపాలనలో జవాబుదారీతనం కేబినెట్ మంత్రుల స్థాయి నుంచే మొదలవుతోందని లోకేష్ స్పష్టం చేశారు. మంత్రుల పనితీరు నివేదికలు , ఫైళ్ల పరిష్కార వేగం , మంత్రుల ర్యాంకింగ్‌లు, క్షేత్రస్థాయిలో కలెక్టర్లతో లైవ్ రివ్యూ సమావేశాలు నిర్వహించడానికి అపారమైన రాజకీయ ధైర్యం అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి కఠినమైన పనితీరును ఐదేళ్లపాటు నిరంతరాయంగా కొనసాగిస్తే, ఆ జవాబుదారీతనం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రతి గ్రామంలోని కింది స్థాయి ఉద్యోగి వరకు చేరుతుందని అన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా విలాసవంతమైన ప్యాలెస్‌లు కట్టుకోవడం సులభమేమో కానీ.. నిజమైన సుపరిపాలన అందించడం అంటే ఒక మహత్తర బాధ్యత అని వ్యాఖ్యానించారు. ఇదే సిద్ధాంతం గత 44 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీ పసుపు జెండాను తరతరాలుగా సగర్వంగా నిలబెట్టిందని ఆయన వివరించారు.రాష్ట్రానికి ప్రాజెక్టులను తీసుకురావడంలో తమ ప్రభుత్వం అవలంబిస్తున్న దూకుడు వ్యూహాన్ని లోకేష్ పంచుకున్నారు. ఒకప్పుడు గుజరాత్ రాష్ట్రం ఇతర ప్రాంతాల నుంచి భారీ పరిశ్రమలను తరలించుకుపోతోందని వార్తలు వినే స్థాయి నుంచి, నేడు స్వయంగా గుజరాత్‌కే వెళ్లి అక్కడ వ్యాపార దిగ్గజాల ముందు ఆంధ్రప్రదేశ్‌ను నంబర్ వన్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా నిలబెట్టేందుకు తాను త్వరలోనే పర్యటించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ నెలకొన్నప్పుడే దేశం అంతిమంగా విజయం సాధిస్తుంది అని స్పష్టం చేశారు. వ్యవసాయం, పారిశ్రామికోత్పత్తి నుంచి సాధారణ పాలన వరకు ప్రతి అంశంలోనూ పనులను శరవేగంగా అమలు చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యమని తెలిపారు.రాష్ట్రంలో పారిశ్రామిక వేగాన్ని మరింత విస్తరించేందుకు 23 ఇండస్ట్రీ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసిందని లోకేష్ వివరించారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన తయారీ సంస్థలు, స్థానిక నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు , నాణ్యతా పరీక్షా ల్యాబ్‌లు, విద్యా సంస్థలను కేవలం 100 కిలోమీటర్ల పరిధిలోని ఒకే ఎకోసిస్టమ్‌లో అనుసంధానం చేయడమే ఈ క్లస్టర్ల ప్రధాన ఉద్దేశమని చెప్పారు. దీని ద్వారా కంపెనీలకు లాజిస్టిక్స్, ఉత్పత్తి వ్యయాలు భారీగా తగ్గడంతో పాటు అంతర్జాతీయ ఇన్వెస్టర్లను పెద్దఎత్తున ఆకర్షించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందడుగు వేస్తోందని, ఆంధ్రప్రదేశ్ ఇకపై దేశంలోనే ఇన్వెస్ట్‌మెంట్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుందని ఫైర్‌సైడ్ చాట్ వేదికగా మంత్రి నారా లోకేష్ ధీమా వ్యక్తం చేశారు.

## విశాఖకు డబుల్ డెక్కర్ ట్రైన్

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 25, పెన్ పవర్:** సాగర నగరం విశాఖపట్నం ప్రజా రవాణా వ్యవస్థలో సరికొత్త విప్లవానికి తెరలేచింది. విశాఖ ప్రజలు ఎప్పటినుంచో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రతిష్టాత్మక విశాఖపట్నం డబుల్ డెక్కర్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ కు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ కీలక పరిణామాన్ని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ స్వయంగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఆమోదం లభించడంతో ప్రాజెక్టు పట్టాలెక్కేందుకు మార్గం సుగమమైందని, త్వరలోనే క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.తీర నగరమైన విశాఖ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును అత్యాధునిక ఇంజనీరింగ్ ప్రమాణాలతో డిజైన్ చేశారు. ఒకే పిల్లర్‌పై దిగువన ఫ్లైఓవర్ రోడ్డు మార్గం, ఎగువన మెట్రో రైలు కారిడార్ వెళ్లేలా డబుల్ డెక్కర్ విధానాన్ని అమలు చేయనున్నారు. భూసేకరణ సమస్యలు, భారీ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు, ఇరుకైన కారిడార్లలో సాధారణ రోడ్డు రవాణా, ప్రజా రవాణా రెండింటికీ ఇది శాశ్వత పరిష్కారంగా నిలవనుంది.ఈ మెట్రో కారిడార్ ద్వారా నగరంలోని ప్రధాన వాణిజ్య ప్రాంతాలు, ఐటీ కారిడార్లు, విద్యా సంస్థలు, పోర్టు ప్రాంతం, ప్రతిపాదిత భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అనుసంధానానికి విస్తృతమైన లబ్ధి చేకూరనుంది. రోడ్డు ట్రాఫిక్ తీవ్రతను గణనీయంగా తగ్గించడంతో పాటు, సామాన్యులు, ఉద్యోగులు తక్కువ సమయంలో సురక్షితంగా, కాలుష్య రహితంగా ప్రయాణించేందుకు ఈ ప్రాజెక్ట్ అత్యంత కీలకం కానుంది.విశాఖను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా, ఏపీ ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దాలన్న కూటమి ప్రభుత్వ సంకల్పానికి కేంద్రం ఆమోదం మరింత వేగాన్ని చేకూర్చింది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో శరవేగంగా నిధుల సమీకరణ పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఈ మెట్రో ప్రాజెక్ట్ పూర్తితో వైజాగ్ రూపురేఖలు అంతర్జాతీయ స్థాయి మెట్రోపాలిటన్ నగరాల సరసన నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.

# నలుగురు జెన్‌జీలకు కోటంరెడ్డి టిక్కెట్లు

**నెల్లూరు, సెప్టెంబర్ 25, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో సరికొత్త నాయకత్వానికి బాటలు వేసే దిశగా అధికార కూటమి వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. రాజకీయాల్లో పేరుకుపోయిన సంప్రదాయ మూస ధోరణిని బద్దలు కొడుతూ, డిజిటల్ యుగంలో పెరిగిన జెన్ జీ యువతను ప్రత్యక్ష ప్రజా జీవితంలోకి ఆహ్వానించాలన్న సరికొత్త కాన్సెప్ట్‌ను తెరపైకి తెస్తోంది. తలలు పండిన తర్వాతే ప్రత్యక్ష ఎన్నికల్లోకి రావాలన్న పాతకాలపు నిబంధనలను పక్కనపెట్టి, సమాజం పట్ల బాధ్యత, సామాజిక చైతన్యం, యువ రక్తంలో ఉన్న ఫైర్‌ను గుర్తించి వారిని కార్పొరేటర్లు, కౌన్సిలర్లుగా నిలబెట్టేందుకు క్షేత్రస్థాయిలో కసరత్తు ముమ్మరం చేసింది.ఈ విప్లవాత్మక మార్పునకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీసుకున్న తాజా నిర్ణయం ఒక బలమైన నాందిగా నిలిచింది. తన నియోజకవర్గ పరిధిలోని నగరపాలక సంస్థ డివిజన్లలో నలుగురు యువ జెన్ జీ అభ్యర్థులకు టిక్కెట్లు కేటాయించడమే కాకుండా, వారి ఎన్నికల ఖర్చు మొత్తాన్ని తానే స్వయంగా భరిస్తానని ఆయన ప్రకటించడం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. రాజకీయాలంటే కేవలం ధనబలం, కుల సమీకరణాలు, పాతతరం నేతలకే పరిమితం కాదనే స్పష్టమైన సందేశాన్ని ఇది ప్రజల్లోకి పంపింది. ఇదే మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కీలక నగరాలు, మేజర్ మున్సిపాలిటీల్లో అమలు చేసి, విద్యావంతులైన యువతను రాజకీయాల్లోకి లాగాలని కూటమి పెద్దలు భావిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో ఓటరు నాడిని పరిశీలిస్తే.. సాంకేతికత, ఆధునిక ఆలోచనలు, వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే నాయకత్వాన్నే నేటి తరం కోరుకుంటోంది. సోషల్ మీడియా ద్వారా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చే యువతీయువకులు పాలనా వ్యవస్థలో భాగస్వాములయితే స్థానిక సంస్థల పనితీరు సమూలంగా మారుతుందని కూటమి విశ్లేషిస్తోంది.ఈ సరికొత్త ప్రయోగం వెనుక ఉన్న అసలు రాజకీయ లక్ష్యం భవిష్యత్ నాయకత్వ నిర్మాణం . టీడీపీ, జనసేన శ్రేణుల్లో రాబోయే రెండు మూడు దశాబ్దాల రాజకీయాలను శాసించగల బలమైన ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకత్వాన్ని ఈ మున్సిపల్ పోరు నుంచే తయారు చేయాలని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ లక్ష్యంగా పెట్టుకున్నారు. క్షేత్రస్థాయిలో వార్డు, డివిజన్ స్థాయి నుంచే ప్రజలతో మమేకమై పనిచేసే నాయకులను తీర్చిదిద్దడం వల్ల పార్టీల సంస్థాగత పునాదులు మరింత పటిష్టమవుతాయని వారు గట్టిగా విశ్వసిస్తున్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం పార్టీల బలపరీక్షగానే కాకుండా.. సంప్రదాయ పాతతరం రాజకీయాలకు, ఆవేశం-ఆలోచన కలగలిసిన కొత్తతరం ఆలోచనలకు మధ్య జరిగే పరివర్తనగా మారనున్నాయి. యువతకు టిక్కెట్లు ఇవ్వడంతో పాటు వారిని గెలిపించుకోగలిగితే, ఏపీ రాజకీయాల్లో ఇదొక సువర్ణ అధ్యాయంగా మిగిలిపోనుంది. ఒకప్పుడు రాజకీయాలంటే భయపడి దూరంగా ఉన్న విద్యావంతులైన యువత, నేడు స్థానిక పాలనను తమ చేతుల్లోకి తీసుకునేందుకు సిద్ధమవుతుండటం రాష్ట్ర ప్రజాస్వామ్య వ్యవస్థకు శుభపరిణామం అవుతుందనడంలో సందేహం లేదు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# న్యూక్లియర్ ఫ్యామిలీస్ రైజ్.. సంప్రదాయాలకు సవాళ్లు ఏంటి?

నేటి మోడరన్ లైఫ్‌స్టైల్‌లో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగై చిన్న కుటుంబాల ట్రెండ్ పెరిగింది. విద్యావంతులు, ఉద్యోగస్తులు కేవలం ఒకరిద్దరు పిల్లలతోనే సరిపెట్టుకుంటున్న ఈ రోజుల్లో.. జనాభా పూర్తిగా తగ్గిపోతున్న కొన్ని ప్రత్యేక కమ్యూనిటీలు ఆందోళన చెందుతున్నాయి. గుజరాత్‌లోని కచ్ఛ్ కడ్వా పాటిదార్ సమాజ్ మూడో బిడ్డను కనేవారికి రూ. 50 వేలు ఇస్తామని ప్రకటించడం, సూరత్ పార్శీలు ప్రత్యేక పథకాలు తలపెట్టడం వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం.

**పెరిగిన జీవన వ్యయం.. మారిన ఆలోచనలు:**

ఆధునిక నగరాల్లో జీవనం సాగించడం అంటే మాటలు కాదు. స్కూల్ ఫీజులు, ఇళ్ల అద్దెలు, వైద్య ఖర్చులు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ నేపథ్యంలో పిల్లలను పెంచడం ఒక పెద్ద ఆర్థిక సవాల్‌గా మారుతోంది. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తూ, కేవలం ఒకరిద్దరు పిల్లలతో న్యూక్లియర్ ఫ్యామిలీగా బతకడానికే నేటి తరం మొగ్గు చూపుతోంది. ఇక ఈ ఆర్థిక ఒత్తిళ్ల వల్లే కుటుంబ పరిమాణం చిన్నదిగా మారిపోతోంది.

**కమ్యూనిటీల ఉనికికే ముప్పు:**

దేశవ్యాప్తంగా జనాభా పెరుగుదల గురించి చర్చ జరుగుతున్నప్పటికీ, కొన్ని చిన్న కమ్యూనిటీల పరిస్థితి మాత్రం ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. ఉదాహరణకు, కచ్ఛ్ కడ్వా పాటిదార్ సమాజ్ జనాభా కేవలం 17 వేలకు పడిపోయింది. ఇలాంటి సూక్ష్మ సామాజిక వర్గాలలో జనాభా తగ్గుతూపోతే, భవిష్యత్తులో వారి ప్రత్యేక సంస్కృతి, ఆచారాలు, సాంప్రదాయాలు కనుమరుగైపోయే ప్రమాదం ఉంది.

**సంతానోత్పత్తిపై ఆర్థిక ప్రోత్సాహకాలు:**

తమ సామాజిక వర్గ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ఈ కమ్యూనిటీలు ఇప్పుడు సరికొత్త దారులు వెతుకుతున్నాయి. దంపతులు మూడో బిడ్డకు జన్మనిస్తే సన్మానించి రూ. 50 వేలు ఫిక్సడ్ డిపాజిట్ చేస్తామని పాటిదార్ సమాజ్ ప్రకటించింది. అలాగే సూరత్ పార్శీ పంచాయత్ కూడా మూడో బిడ్డకు 25 ఏళ్లు వచ్చే వరకు నెలకు రూ. 5 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. జనాభాను పెంచేందుకు సంఘాలే నేరుగా రంగంలోకి దిగడం గమనార్హం.

**ఆధునికత వర్సెస్ సంప్రదాయాల పోరు:**

ఒకవైపు వ్యక్తిగత స్వేచ్ఛ, కెరీర్, ప్రశాంతమైన చిన్న కుటుంబం అనే ఆధునిక భావనలు బలపడుతుంటే, మరోవైపు వంశాభివృద్ధి, కమ్యూనిటీ ఉనికిని కాపాడుకోవాలనే సాంప్రదాయ ఒత్తిడి ఎదురవుతోంది. ఇక ఈ రెండింటి మధ్య నలిగిపోతున్న నేటి యువతను మూడో సంతానం వైపు ఆకర్షించడం అంత సులువైన విషయం కాదు. కేవలం ఆర్థిక సాయాలతోనే ఈ సమస్య పరిష్కారం కాకపోవచ్చు.

**భవిష్యత్తు తెచ్చే మార్పులు:**

పట్టణీకరణ తెచ్చిన మార్పుల వల్ల చిన్న కుటుంబాల సంస్కృతి మరింత వేగంగా విస్తరిస్తోంది. అయితే చిన్న కమ్యూనిటీలు తమ ఉనికిని కాపాడుకోవడానికి చేస్తున్న ఈ ప్రయత్నాలు రాబోయే రోజుల్లో ఎలాంటి ఫలితాలను ఇస్తాయనేది ఆసక్తికరంగా మారింది. ఆర్థిక సాయాలు ఏ మేరకు జనాభాను పెంచుతాయో కాలమే సమాధానం చెప్పాలి.

# కుక్క కరవకపోయినా రేబీస్‌తో బాలుడు మృతి.. అసలు ఎలా జరిగిందంటే?



కుక్క కరిస్తేనే రేబీస్ వస్తుందని అనుకోవడం పొరపాటే. రేబీస్ సోకిన జంతువు లాలాజలం గాయం, కళ్లు, ముక్కు, నోరు వంటి శరీర భాగాలకు తగిలినా వైరస్ శరీరంలోకి ప్రవేశించే ప్రమాదం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లాలో జరిగిన విషాద ఘటన ఈ విషయాన్ని మరోసారి గుర్తుచేసింది. కుక్క కరవకపోయినా.. దాని లాలాజలం ద్వారా రేబీస్ సోకి రెండేళ్ల బాలుడు మృతి చెందాడు.బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా ఈపూరు మండలం బొగ్గరం గ్రామానికి చెందిన లక్కిశెట్టి రవితేజ, నాగలక్ష్మి దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారికి రెండేళ్ల కుమారుడు సోహాన్ రుద్రాన్ష్‌తో పాటు 20 రోజుల వయసున్న చిన్నారి కూడా ఉంది. రుద్రాన్ష్‌కు చిన్నప్పటి నుంచి కుక్కలంటే భయం లేకపోవడంతో ఇంటి పరిసరాల్లో ఉండే వీధి కుక్కలతో తరచూ ఆడుకునేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ క్రమంలో సుమారు 15 రోజుల క్రితం బాలుడు ఇంటి బయట ఆడుకుంటూ కిందపడిపోయాడు. దీంతో అతడి ముఖంపై చిన్న గాయం ఏర్పడింది. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఓ వీధి కుక్క బాలుడితో ఆడుకుంటూ అతడి ముఖంపై ఉన్న గాయాన్ని నాకినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ సమయంలో కుక్క కరవకపోవడంతో తల్లిదండ్రులు పెద్దగా అనుమానించలేదు. అయితే ఆ కుక్క లాలాజలం గాయంపై పడటం ద్వారా రేబీస్ వైరస్ బాలుడి శరీరంలోకి ప్రవేశించి ఉండొచ్చని వైద్యులు వెల్లడించినట్లు సమాచారం.

కొన్ని రోజుల వరకు బాలుడు సాధారణంగానే ఉన్నాడు. అయితే ఈ నెల 22న అతడి ప్రవర్తనలో అకస్మాత్తుగా మార్పులు కనిపించాయి. భయంతో కేకలు వేయడం, నీళ్లు తాగడానికి ఇబ్బంది పడటం, వెక్కిళ్లు పెట్టడం వంటి లక్షణాలు కనిపించడంతో తల్లిదండ్రులు వెంటనే నరసరావుపేటలోని ఓ పిల్లల ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు రేబీస్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించి.. వ్యాధి తీవ్ర దశకు చేరుకుందని తెలిపినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.మెరుగైన చికిత్స కోసం అదే రోజు రాత్రి బాలుడిని గుంటూరుకు తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందినట్లు సమాచారం. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమారుడిని అకస్మాత్తుగా కోల్పోవడంతో తల్లిదండ్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.ఈ ఘటన రేబీస్‌పై అవగాహన ఎంత ముఖ్యమో తెలియజేస్తోంది. కుక్క కరవకపోయినా.. రేబీస్ అనుమానం ఉన్న జంతువు లాలాజలం తెరిచి ఉన్న గాయం లేదా కళ్లు, ముక్కు, నోరు వంటి శరీర భాగాలకు తగిలితే దాన్ని నిర్లక్ష్యం చేయకూడదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అలాంటి సందర్భాల్లో వెంటనే గాయాన్ని సబ్బు, ప్రవహించే నీటితో శుభ్రంగా కడిగి, ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించి అవసరమైన రేబీస్ నిరోధక చికిత్స తీసుకోవడం అత్యంత కీలకం.

# హెచ్-1బీ కన్సల్టెన్సీలపై యూట్యూబర్ల దాడి: బాధితులకు న్యాయమా? వ్యూస్ కోసం సంచలనమా?




అమెరికాలో ఉద్యోగం సాధించాలనేది ప్రతిభావంతులైన వేలాది మంది భారతీయ టెక్కీల డ్రీమ్. ముఖ్యంగా ఐటీ రంగానికి చెందిన నిపుణులకు హెచ్1బీ వీసా కేవలం ఒక పని అనుమతి పత్రం మాత్రమే కాదు.. మెరుగైన జీవితం, ఆకర్షణీయమైన వేతనం, భవిష్యత్తులో గ్రీన్‌కార్డ్ సాధనకు అది ఒక ప్రధాన ద్వారం. అయితే, కొందరు యజమానులు, లేబర్ బ్రోకర్లు ఈ వ్యవస్థలోని సవాళ్లను ఆసరాగా చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు పెరగడంతో ఇటీవల అమెరికా ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది.

అమెరికా కార్మిక శాఖ (డీఓఎల్) ఇన్‌స్పెక్టర్ జనరల్ కార్యాలయం హెచ్1బీ పీఈఆర్ఎం కార్యక్రమాల్లో జరుగుతున్న మోసాలు, తక్కువ వేతనాల చెల్లింపు.. అనధికారిక కోతలు.. విదేశీ ఉద్యోగుల దోపిడీపై ప్రత్యేక దర్యాప్తులను ముమ్మరం చేసింది.

ఈ క్రమంలోనే సరికొత్త ధోరణి వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని కొందరు యూట్యూబర్లు హెచ్1బీ కన్సల్టెన్సీలను లక్ష్యంగా చేసుకుని వరుస వీడియోలు చేయడం.. కొన్ని సంస్థలపై తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించడం చర్చనీయాంశంగా మారింది.

**వ్యూస్ వేటలో ప్రాథమిక ఆధారాలు మరుగునపడుతున్నాయా?**

సమాజంలో లేదా ఒక వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలను వెలుగులోకి తీసుకురావడం బాధ్యతాయుతమైన డిజిటల్ మీడియా విధి. అయితే అధికారిక విచారణ అధికారులు లేదా న్యాయస్థానాలు నిర్ధారించకముందే వ్యక్తులను, సంస్థలను నేరుగా లక్ష్యంగా చేసుకోవడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంచలనాత్మక థంబ్‌నెయిల్స్, అతిశయోక్తి వ్యాఖ్యానాలు, వ్యక్తిగత దూషణలతో కూడిన కంటెంట్ వల్ల అసలు సమస్య పక్కదారి పట్టే ప్రమాదం ఉంది. అన్ని కన్సల్టెన్సీలు మోసపూరితమైనవే అనే భావన కలిగించేలా వ్యాఖ్యానించడం వల్ల నిబంధనలకు లోబడి చట్టబద్ధంగా సేవలందిస్తున్న వేలాది సంస్థల ప్రతిష్ట కూడా దెబ్బతింటుంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతి సంస్థను ముందే దోషిగా చిత్రీకరించడం సరైన విధానం కాదు. విమర్శలు ఆధారాలతో కూడి ఉండాలి తప్ప.. వ్యూస్ కోసం సంచలనంగా మారకూడదు.

**అధికారిక దర్యాప్తులు.. డిజిటల్ విచారణలు**

హెచ్1బీ వ్యవస్థలో మోసాలను నిరోధించేందుకు అమెరికా చట్టాల్లో పటిష్టమైన యంత్రాంగం ఉంది. లేబర్ కండిషన్ అప్లికేషన్ (ఎల్సీఏ) ఉల్లంఘనలు, వేతన వ్యత్యాసాలపై ఉద్యోగులు ఫిర్యాదు చేసినప్పుడు ప్రభుత్వ అధికారులు నేరుగా రంగంలోకి దిగుతారు. డల్లాస్ వంటి ప్రధాన సాంకేతిక కేంద్రాల్లో ఇటీవల అధికారులు కొన్ని కార్యాలయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొన్ని చోట్ల తలుపులు మూసి ఉండటం నమోదు చేశారు. క్షేత్రస్థాయి పరిశీలనలు ఒక ప్రాథమిక ప్రక్రియ మాత్రమే. ఇవే తుది తీర్పులు కావు.. అధికారిక విచారణ నివేదికలు, కోర్టు ఆదేశాల ఆధారంగానే అక్రమాలను నిర్ధారించాల్సి ఉంటుంది.

**టెక్కీల భవిష్యత్తు కోసమైనా బాధ్యతాయుతమైన జర్నలిజం అవసరం**

అప్పులు చేసి, న్యాయవాదుల రుసుములు చెల్లించి.. అమెరికా ఇమ్మిగ్రేషన్ కఠిన నిబంధనలతో ఏళ్ల తరబడి శ్రమించి అమెరికా చేరుకునే సగటు టెక్కీకి ఉద్యోగం ఊడిపోవడం లేదా జీతాలు అందకపోవడం అనేది జీవన్మరణ సమస్య. అయితే ఈ ప్రక్రియలో వాస్తవాలు, రికార్డులు, అధికారిక ఆధారాలను పునఃపరిశీలించకుండా ఇచ్చే తీర్పులు నిజమైన బాధితులకు న్యాయం చేయకపోగా అనవసరమైన భయాందోళనలను సృష్టిస్తాయి. హెచ్1బీ వ్యవస్థ పారదర్శకంగా మారాలి.. దోషులకు శిక్ష పడాలి. అయితే ఆ పని చేయాల్సింది చట్టబద్ధమైన విచారణ సంస్థలు మాత్రమే.. యూట్యూబ్ వేదికలు కాదు.అమెరికన్ యూట్యూబర్లు ఇప్పటికైె భారతీయ టెకీలు, సంస్థలపై పడి ఇలా పీక్కుతినకుండా వారి న్యాయమైన ప్రక్రియలు, వారి బాధలు అర్థం చేసుకొని ముందుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# సరిహద్దులు దాటిన రీసెర్చ్.. గ్లోబల్ కొలాబరేషన్ సక్సెస్ స్టోరీ!



ఒక పెద్ద సమస్యను పరిష్కరించాలంటే కేవలం ఒక్కరి ప్రతిభ సరిపోదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులు ఒకే తాటిపైకి రావాలి. గబ్బిలాల పుట్టుకకు సంబంధించిన రహస్యాన్ని ఛేదించేందుకు 64 దేశాల నుంచి 137 మంది శాస్త్రవేత్తలు దశాబ్ద కాలం పాటు శ్రమించి 'బ్యాట్1కే' ప్రాజెక్ట్‌ను విజయవంతం చేశారు. భౌగోళిక సరిహద్దులను చెరిపేస్తూ, విజ్ఞానాన్ని పంచుకుంటూ సాగిన ఈ గ్లోబల్ రీసెర్చ్ సక్సెస్ స్టోరీ వెనుక ఉన్న ఆసక్తికర విశేషాలు ఇప్పుడు చూద్దాం.

**సరిహద్దులు లేని సైన్స్ ప్రయాణం:**

సైన్స్ రంగంలో ఎప్పుడైతే పరిశోధకులు తమ దేశాల పరిధులను దాటి ఆలోచిస్తారో, అప్పుడే అద్భుతాలు సృష్టింపబడతాయి. గబ్బిలాలు ఎక్కడ పుట్టాయి అనే అంశంపై దశాబ్దాలుగా ఉన్న భిన్నాభిప్రాయాలను తొలగించడానికి ఒక అంతర్జాతీయ కన్సార్టియమ్ ఏర్పడింది. కేవలం ఒక్క దేశం లేదా ఒక యూనివర్సిటీకి పరిమితం కాకుండా, ప్రపంచంలోని నలుమూలల నుంచి నిపుణులను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి చేసిన ఈ ప్రయత్నం మోడర్న్ సైన్స్‌కు సరికొత్త దిశను చూపింది.

**దశాబ్ద కాలం శ్రమ.. భారీ డేటా:**

ఒక జీవ జాతి పరిణామ క్రమాన్ని వెలికితీయడం అంటే మాటలు కాదు. దాదాపు పదేళ్ల పాటు ఈ ప్రాజెక్ట్ కోసం శాస్త్రవేత్తలు అహర్నిశలు శ్రమించారు. వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన 103 రకాల గబ్బిలాల డీఎన్ఏను సీక్వెన్సింగ్ చేయడం, ప్రపంచవ్యాప్తంగా దొరికిన 44 ప్రాచీన శిలాజాల డేటాతో దానిని సరిపోల్చడం సాధారణ విషయం కాదు. ఇక ఈ భారీ డేటా విశ్లేషణ కోసం ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని, నిపుణుల మేధస్సును పూర్తిగా ఉపయోగించుకున్నారు.

**'బిగ్ సైన్స్' ప్రాజెక్టుల ప్రాధాన్యత:**

ఇలాంటి భారీ పరిశోధనలను 'బిగ్ సైన్స్' ప్రాజెక్టులుగా పిలుస్తారు. ఇందులో ఒకరికొకరు సమాచారాన్ని, ఆలోచనలను పంచుకుంటూ ముందుకు వెళ్తారు. ఇక ఎమ్మా టీలింగ్, నెన్సీ సిమ్మన్స్ వంటి ప్రముఖుల నేతృత్వంలో సాగిన ఈ ప్రయాణంలో ప్రతీ శాస్త్రవేత్త తమ వంతు కీలక పాత్ర పోషించారు.

**మానవ వైద్య రంగానికి కొత్త బాటలు:**

ఈ గ్లోబల్ కొలాబరేషన్ కేవలం గబ్బిలాల పుట్టుకను కనుగొనడంతో ఆగిపోలేదు. వాటిలోని క్యాన్సర్ నిరోధక జన్యువులు,

అద్భుతమైన రోగనిరోధక శక్తిని అర్థం చేసుకోవడానికి ఈ డేటా ఎంతో ఉపయోగపడుతోంది. ఇక భవిష్యత్తులో మానవ వైద్య రంగంలో ప్రాణాంతక వ్యాధులకు మందులు కనుగొనే పరిశోధనలకు ఈ ఉమ్మడి కృషి ఒక బలమైన పునాది వేసింది. కలిసికట్టుగా పనిచేస్తే ఎలాంటి క్లిష్టమైన సమస్యలనైనా సులభంగా సాధించవచ్చని ఇది నిరూపించింది.

**సహకారమే విజయానికి సోపానం:**

విజ్ఞాన శాస్త్రం అనేది ఎవరి సొత్తు కాదు, అది మానవాళి అందరికోసం. 'బ్యాట్1కే' ప్రాజెక్ట్ నిరూపించిన సత్యం ఇదే. వివిధ దేశాల శాస్త్రవేత్తలు తమ స్వార్థాన్ని పక్కనపెట్టి, ఒకే లక్ష్యంతో కలిసి పనిచేస్తే ప్రకృతి రహస్యాలను కూడా సులువుగా ఛేదించవచ్చు. ఇక ఈ గ్లోబల్ కొలాబరేషన్ సక్సెస్ స్టోరీ భవిష్యత్ తరాల పరిశోధకులకు ఒక గొప్ప మార్గదర్శిగా నిలవడంలో ఎలాంటి సందేహం లేదు.

# రాహుల్ సైడ్.. ప్రియాంక ఇన్.. కాంగ్రెస్‌లో ఏం జరుగుతోంది..?



కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యూహాల్లో నిశ్శబ్దంగా ఒక భారీ మార్పు చోటుచేసుకుంటోంది. రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ అధిష్ఠానం ఒక సరికొత్త రోల్ డివిజన్ కు శ్రీకారం చుట్టింది. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతగా జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసే బాధ్యతలను రాహుల్ గాంధీ చూసుకుంటుంటే.. క్షేత్రస్థాయిలో రాష్ట్రాల పోరును తన భుజస్కంధాలపై వేసుకునేందుకు ప్రియాంక గాంధీ వాద్రా సిద్ధమవుతున్నారు.

ఈ కొత్త రాజకీయ సమీకరణం వెనుక ఒక పక్కా వ్యూహం దాగి ఉంది. సాధారణంగా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను కూడా 'మోదీ వర్సెస్ రాహుల్' పోరుగా మలచి జాతీయ అంశాల చుట్టూ తిప్పడం బీజేపీకి అలవాటైన శైలి. ఈ తంత్రానికి చెక్ పెట్టడానికే ప్రియాంకను ముందు వరుసలో నిలుపుతున్నారు. జాతీయ వివాదాల జోలికి వెళ్లకుండా.. ధరల పెరుగుదల, నిరుద్యోగం, మహిళా సంక్షేమం వంటి ప్రత్యక్ష ప్రజా సమస్యలనే ప్రధాన ఆయుధాలుగా మార్చుకోవడంలో ప్రియాంక సిద్ధహస్తురాలు. దీనివల్ల అసెంబ్లీ ఎన్నికల అజెండా స్థానిక అంశాల చుట్టూనే తిరిగేలా చేయడంలో కాంగ్రెస్ సఫలమవుతోంది. గతంలో హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో నిమగ్నమైన వేళ.. ప్రియాంక నడిపిన దూకుడు ప్రచారమే పార్టీకి అద్భుత విజయాలను అందించింది. నాయనమ్మ ఇందిరా గాంధీని గుర్తుచేసే హావభావాలు, సాధారణ ప్రజలతో, ముఖ్యంగా మహిళా ఓటర్లతో సులభంగా మమేకమయ్యే నైజం ఉత్తర, మధ్య భారతంలో ఆమెకు ప్రత్యేక ఇమేజ్‌ను తెచ్చిపెట్టాయి. దీనికితోడు స్థానిక నాయకుల మధ్య ఉండే గ్రూపు తగాదాలను సమర్థవంతంగా చక్కదిద్దడంలోనూ ఆమె అనుసరించే శైలి మంచి ఫలితాలనిస్తోంది.

అయితే, కేవలం వ్యక్తుల గ్లామర్ మాత్రమే ఎన్నికలను గెలిపించలేదనేది గత అనుభవాలు చెబుతున్న పాఠం. బూత్ స్థాయి మేనేజ్‌మెంట్, బలమైన సంస్థాగత నిర్మాణం లేకపోతే ఎంతటి నాయకత్వ చరిష్మా అయినా ఒంటరిగా విజయాన్ని అందించలేదని గత ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఫలితాలు నిరూపించాయి. అందుకే ఈసారి ప్రియాంక క్రేజ్‌ను వాడుకోవడంతో పాటు క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని పటిష్టం చేసుకోవడం కాంగ్రెస్‌కు ప్రధాన సవాలుగా మారనుంది.

పార్టీ సంక్షోభంలో ఉన్న ప్రతిసారీ ఒక 'ట్రబుల్ షూటర్'లా కనిపించే ప్రియాంక ఫ్యాక్టర్‌ను ఈసారి పూర్తిస్థాయి మాస్ లీడర్‌గా ప్రయోగించాలని అధిష్ఠానం నిర్ణయించింది. జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ పోరాటం, రాష్ట్రాల స్థాయిలో ప్రియాంక వ్యూహాత్మక ప్రచారం.. ఈ 'డబుల్ ఇంజన్' వ్యూహం రాబోయే ఎన్నికల సమరాల్లో కాంగ్రెస్‌కు ఏ మేరకు పునరుజ్జీవాన్ని ఇస్తుందో కాలమే నిర్ణయించాలి.

భారత రాజకీయ వ్యవస్థలో విడ్డూరమైన వైరుధ్యం -ఎన్నికల ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలకు, పదో షెడ్యూల్ వినా, రాజ్యాంగంలో ఎక్కడా ప్రత్యేక ప్రస్తావన లేకపోవడం. అధికరణ 19 కింద ప్రాథమిక హక్కులను ముందుకు తీసుకెళ్లే "సంఘాలు"గానే వాటిని పరిగణిస్తారు. కంపెనీ, ట్రస్ట్, సొసైటీ, సంస్థగా వాటి చట్టపరమైన స్వభావాన్ని నిర్వచించే ప్రయత్నం ఎప్పుడూ జరగలేదు. అయినా, ఆదాయ పన్ను మినహాయింపు అపూర్వ రీతిలో పొందుతూ, లెక్కలు చూపించని డబ్బుకు అవి రహస్య నిధిగా మారుతున్నాయి. షెల్ కంపెనీలు నిర్దేశించని ప్రయోజనాలు నెరవేర్చినట్టే, షెల్ రాజకీయ పార్టీలూ చీకటి ప్రయోజనాలకు ఉపయోగపడుతున్న రహస్యాన్ని ఇటీవల హిందీ బీబీసీ ఓ కథనాన్ని ఛేదించింది. గుజరాత్ కేంద్రంగా ఉన్న ఆరు నమోదిత గుర్తింపులేని రాజకీయ పార్టీలు (ఆర్‌యూపీపీలు) 2023-24లో సుమారు రూ.1,700.78 కోట్ల విరాళాలు అందుకున్నాయన్నది ఆ దర్యాప్తు కథన సారాంశం. ఈ మొత్తం బీజేపీ వినా ఐదు జాతీయ పార్టీలు (కాంగ్రెస్, ఆప్, బీఎస్పీ, సీపీఎం, నేషనల్ పీపుల్స్ పార్టీ) కలిపి అందుకున్న రూ.1,480.43 కోట్ల కంటే ఎక్కువ! వీటిలో అత్యధికంగా 'ఆమ్ జన్‌మత్ పార్టీ' రూ.620 కోట్లు అందుకోగా, 'సత్యవాది రక్షక్ పార్టీ' రూ.330.55 కోట్లు అందుకుంది. ఈ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో కేవలం ఒక్క అభ్యర్థినే బరిలో నిలిపింది. ఇది భారత రాజకీయాల్లోనే ఆసక్తికరమైన కోణం.

ఇంతకుముందు, అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) 2025 జులై 18న విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2022-23లో ఆర్‌యూపీపీల ప్రకటిత ఆదాయంలో 223 శాతం పెరుగుదల నమోదైంది. మొత్తం 2,764 ఆర్‌యూపీపీల్లో కేవలం 739 మాత్రమే ఆర్థిక రికార్డులను భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) సమర్పించాయి. 2025 ఆగస్టులో "ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయడం" పేరిట విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో.. సమగ్ర, నిరంతర వ్యూహంలో భాగంగా 334 ఆర్‌యూపీపీలను తొలగించినట్టు ఈసీఐ ప్రకటించింది. దీంతో ఇప్పుడు దేశంలో ఆరు జాతీయ పార్టీలు, 67 రాష్ట్ర పార్టీలు, 2,520 ఆర్‌యూపీపీలు నమోదై ఉన్నాయి. అయితే, తొలగింపు అంటే నమోదు రద్దు కాదు, ఈసీఐకి సాధారణంగా పార్టీలను రద్దు చేసే అధికారం లేదు. అలాగే, గుర్తింపు లేకున్నా, ఆర్‌యూపీపీలకు ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 29ఏ కింద విరాళాలు స్వీకరించే అర్హత ఉంది. ఆదాయ పన్ను చట్టం-2025లోని సెక్షన్ 12 కింద మినహాయింపూ పొందే అవకాశముంది. తొలగింపు వెనుక ఉద్దేశం వాటిని అనర్హులుగా చేయడమే అయినప్పటికీ, అలాంటి విరాళాలు పన్ను మినహాయింపునకు అవి అర్హత పొందుతూనే ఉంటాయా? అన్నది దర్యాప్తు చేయాల్సిన అంశం.

రాజకీయ సంపద స్థాయి ఎంత భారీగా ఉందో ఒక అధ్యయనం వెల్లడించింది. 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి 22 రాజకీయ పార్టీలవద్ద వేల కోట్లున్నాయని, ఎన్నికల ప్రకటన నుంచి పూర్తయ్యే వరకూ మరిన్ని వందల కోట్లు విరాళాలు వచ్చాయని, ప్రచార వ్యయం పోను ఎన్నికల అనంతరం కూడా భారీ మొత్తంలో నగదు, బ్యాంకు నిల్వలు మిగిలి ఉన్నాయని ఈసీఐకి సమర్పించిన లెక్కల ఆధారంగా

## అప్పటివరకూ.. ఇంతే!

అధ్యయనం పేర్కొంది. గత దశాబ్దంలో రాజకీయ విరాళాలపై పన్ను మినహాయింపు వల్ల ప్రభుత్వ ఖజానాకు వేల కోట్లు నష్టం వాటిల్లిందని, పార్టీలకు విరాళాలు ఇవ్వడంలో వ్యక్తిగత దాతలు, హిందూ అవిభక్త కుటుంబాలు కార్పొరేట్ సంస్థలను మించిపోయాయనీ అధ్యయనం గుర్తించింది. మొత్తం ప్రకటిత విరాళాల్లో సగంకంటే తక్కువ మొత్తాన్నే పన్ను మినహాయింపుగా క్లెయిమ్ చేయడం, పన్ను ప్రయోజనం లేకుండానే విరాళాలివ్వడానికి పురిగొల్పుతున్న ప్రేరణ ఏమిటన్న ప్రశ్నను లేవనెత్తుతోంది. ఈ మొత్తం వ్యవహారానికి గాఢమైన గోప్యత జోడించింది, పాలక పార్టీ 2018లో ప్రవేశపెట్టిన 'ఎన్నికల బాండ్ల' పథకం. ఈ పథకాన్ని 2024లో సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించినప్పటికీ, తర్వాత బహిర్గతమైన విరాళాల వివరాలు సమాధానం లేని ప్రశ్నలుగా ఉండిపోయాయి. ఎక్కువ ఆర్‌యూపీపీలకు ఎన్నికల బాండ్లు అందలేదు, ఎందుకంటే అవి నిర్దిష్ట శాతం ఓట్లు సాధించిన పార్టీలకు మాత్రమే పరిమితం. మరి ఈ విరాళాలు ఇచ్చింది ఎవరు? ఎందుకు? అన్నది ఇప్పటికీ మిస్టరీనే. రాజకీయ పార్టీలు పారదర్శకత పట్ల ఎప్పుడూ పెద్దగా ఆసక్తి చూపలేదు. తమను సమాచార హక్కు చట్టం పరిధిలోకి తీసుకురావాలన్న కేంద్ర సమాచార కమిషన్ ఆదేశాన్ని వ్యతిరేకించడంలో అన్ని పార్టీలూ ఏకమయ్యాయి. ఆసక్తికరంగా, సీఐసీ మినహా, ఈసీఐగానీ సుప్రీంకోర్టుగానీ దీన్ని అమలు చేయాలన్న ఆసక్తి చూపలేదు. సాధారణ పన్ను చెల్లింపుదారుల మాదిరిగా, రాజకీయ పార్టీల ఖాతాల పరిశీలన ఆదాయ పన్ను శాఖ, ఈడీలకు ప్రాధాన్యతగా అనిపించకపోవచ్చు. యాంత్రికంగా సమర్పించే లెక్కలను ప్రశ్నించే అధికారం, ఉద్దేశం ఈసీఐకి లేదు. చట్టాన్ని పాటించడానికి లెక్కల సమర్పణే సరిపోతుంది, దాని ఆత్మ మాత్రం మిగిలిపోతుంది. ఆ ఆత్మను ఎవరు, ఎలా పునరుద్ధరిస్తారు? ఎన్నికల బాండ్ల వ్యవహారంపై, పెండింగ్‌లో ఉన్న పిటిషన్లలో ఆరోపిస్తున్న క్విడ్ ప్రో కో అంశంపై కోర్టు పర్యవేక్షిత దర్యాప్తునకు ఆదేశించడం సుప్రీంకోర్టు బాధ్యతగా మారింది. ఎన్నికల ప్రక్రియలో గణనీయంగా పాల్గొనకుండానే భారీ విరాళాలు అందుకుంటున్న అప్రధానమైన ఆర్‌యూపీపీల దృగ్విషయాన్ని కూడా ఈ దర్యాప్తు పరిశీలించాలి. "అధికారానికి నిల్వ కేంద్రం"గా అభివర్ణించిన అధికరణ 324 కింద తనకున్న అధికారాలను వినియోగించి, రాజకీయ పార్టీల ఖాతాలను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ద్వారా ఆడిట్ చేయించాలని ఈసీఐ ఆదేశించాలి. ఎన్నికల సమయంలో పార్టీల వ్యయంపై పరిమితి విధించడాన్నీ పరిగణించాలి. దీన్ని కమిషనే పదేపదే సిఫారసు చేసింది. విరాళాలపై పన్ను మినహాయింపును నిర్దేశిత వ్యయ పరిమితికే పరిమితం చేయాలి, పార్టీలను సంపన్నం చేసే మిగిలిన అన్ని విరాళాలపై పూర్తిగా పన్ను విధించాలి. మార్గదర్శకాలను అనుసరించి ఎన్నికల్లో పోటీ చేయని ఏ ఆర్‌యూపీపీనైనా స్వయంచాలకంగా తొలగించే ప్రక్రియను, ప్రామాణిక ఆకృతుల్లో ఆర్థిక డేటాను అప్‌లోడ్ చేయగల కేంద్రీకృత డిజిటల్ పోర్టల్‌ను ఈసీఐ ఏర్పాటు చేయాలి. నిజమైన ఓటర్లను.. జాబితా నుంచి తొలగించే పనిలో నిమగ్నం కావడం కంటే, ఎన్నికల వాతావరణాన్ని ప్రక్షాళన చేయడంలో తన శక్తిని, అధికారాన్ని ఈసీఐ వెచ్చించనివ్వాలి. అప్పటివరకూ, "మేమిక్కడ ఉన్నాం" అని నినదించడం వినా.. ప్రజలకు మరో మార్గం లేదు!

---

### పనికొచ్చే పలుకు



## ఆటలో.. నిలబడాలి!

జీవితం రేస్ అయితే.. రోజూ ఫినిషింగ్ లైన్ దాటాల్సిన అవసరం లేదు. కొన్ని రోజులు వేగంగా పరిగెత్తగలం. కొన్ని రోజులు నెమ్మదిగా నడవాల్సి వస్తుంది. మరికొన్ని రోజులు అసలు ముందుకు కదలలేనట్టుగా అనిపించొచ్చు. కానీ ఒక విషయం మాత్రం ముఖ్యం -రేస్‌నుంచి బయటకు వెళ్లకపోవడం. మనలో చాలామందికి విజయాన్ని చూసే విధానం భిన్నంగా ఉంటుంది. వెంటనే ఫలితం రావాలి. మొదలుపెట్టిన పని త్వరగా పూర్తవ్వాలి. కొత్త అలవాటు పెట్టుకుంటే కొద్ది రోజుల్లోనే మార్పు కనిపించాలి. జిమ్‌కు వెళ్తే వెంటనే శరీరంలో మార్పు రావాలి. కొత్త స్కిల్ నేర్చుకుంటే వెంటనే నైపుణ్యం రావాలి. అలా జరగకపోతే.. "ఇది నావల్ల కాదు" అంటూ మధ్యలోనే ఆపేస్తాం. కానీ నిజమైన ఎదుగుదల అక్కడే మొదలవుతుంది, ఫలితం కనిపించని సమయంలోనూ ప్రయత్నాన్ని కొనసాగించినప్పుడు.

మొక్కను నాటిన రోజే పండ్లు రావు. ప్రతిరోజూ నీళ్లు పోయాలి. ఎండైనా, వానైనా దాన్ని చూసుకోవాలి. బయటకు పెద్దగా మార్పు కనిపించని రోజుల్లోనూ లోపల వేర్లు బలపడుతూనే ఉంటాయి. మన జీవితంలో చేసే చిన్న ప్రయత్నాలూ అంతే. బయటికి కనిపించకపోయినా.. మనలో మార్పు జరుగుతూనే ఉంటుంది.

ఇదే విషయాన్ని లైఫ్‌స్టైల్‌కు అన్వయిస్తే చాలా విషయాలు అర్థమవుతాయి. ఆరోగ్యంగా ఉండాలని నిర్ణయించుకున్నాం అనుకోండి. మొదటివారం డైట్ పాటించాం. రెండోవారం వ్యాయామం చేశాం. మూడోవారం బిజీగా ఉండి రొటీన్ మిస్ అయింది. అక్కడితో "నావల్ల కాదు" అనుకోవాల్సిన అవసరం లేదు. మరుసటి రోజు మళ్లీ మొదలుపెట్టొచ్చు. ఒక రోజు రొటీన్ తప్పిపోవడం ఓటమి కాదు, దాన్ని శాశ్వతంగా వదిలేయడమే అసలు సమస్య.

జెన్ జీకి ఈ సూత్రం మరింత అవసరం. ఎందుకంటే ఈ తరం ముందు అవకాశాలు ఎంత ఎక్కువగా ఉన్నాయో.. డిస్ట్రేక్షన్స్ కూడా అంతే ఎక్కువ. ఒక స్కిల్ నేర్చుకుంటూ ఉండగానే మరో ట్రెండ్ కనిపిస్తుంది. ఒక లక్ష్యంపై ఫోకస్ పెడుతుండగానే సోషల్ మీడియాలో మరో విజయకథ కనిపిస్తుంది. దాంతో మన ప్రయాణం నెమ్మదిగా ఉందేమోననే అనుమానం మొదలవుతుంది. కానీ ఇతరుల హైలైట్స్‌తో మన బిహైండ్ ది సీన్స్‌ను పోల్చుకోవడం సరైన కొలమానం కాదు.

జీవితం మనకు ఎప్పుడూ ఒకే రకమైన పరిస్థితులు ఇవ్వదు. అందుకే నిలకడ అంటే ఒకే పద్ధతిలో మొండిగా కొనసాగడం కాదు. పరిస్థితులకు అనుగుణంగా పద్ధతిని మార్చుకుంటూ లక్ష్యాన్ని మాత్రం వదలకుండా ఉండటం. జిమ్‌కు వెళ్లలేని రోజు ఇంట్లోనే వర్కౌట్ చేయొచ్చు. ఎక్కువ సమయం చదవలేని రోజు కనీసం కొంతసేపు చదవొచ్చు. పెద్ద లక్ష్యాన్ని ఒకేసారి చేరుకోలేకపోతే దాన్ని చిన్న టార్గెట్లుగా విడగొట్టొచ్చు. మనకు ప్రతిరోజూ విజయం అవసరం లేదు. ప్రతిరోజూ ఒక చిన్న అడుగు చాలు. కొన్ని రోజులు మనం ముందుకు వెళ్తాం. కొన్ని రోజులు అక్కడే ఉంటాం. కొన్ని రోజులు ఒక అడుగు వెనక్కి వెళ్లాల్సి కూడా రావచ్చు. కానీ మళ్లీ ముందుకు కదిలే మనస్తత్వమే మనల్ని గమ్యంవైపు తీసుకెళ్తుంది. అందుకే జీవితంలో మీపై ఎన్ని సవాళ్లు వచ్చినా.. మీ సామర్థ్యాన్ని ఒక చెడ్డ రోజు ఆధారంగా నిర్ణయించుకోకండి. ఒక ఫెయిల్యూర్ మీ కథకు ముగింపు కాదు. ఒక ఆలస్యం మీ ప్రయాణానికి బ్రేక్ కాదు. ఆపేయడం మాత్రమే నిజమైన ముగింపు.

గుర్తుంచుకోండి..
రోజూ గెలవాల్సిన అవసరం లేదు.
రోజూ నిలబడాలి.
ఎందుకంటే విజయం ఒక్కరోజు సాధించిన ఫలితం కాదు..
ఎన్ని రోజులు వదలకుండా నిలబడ్డామో దాని ఫలితం!

---

# ట్రంప్ తుమ్మితే.. తిరుప్పూర్‌కు జలుబు!



తమిళనాడులోని నొయ్యల్ నది ఒడ్డునున్న తిరుప్పూర్‌కు 'డాలర్ సిటీ' అనే ముద్దుపేరు ఊరికే రాలేదు. వేలాది ఎగుమతి ఆధారిత దుస్తుల, హోజియరీ యూనిట్లు, వాటిని నడిపించే వలస కార్మికులు, వారు తీసుకొచ్చే డాలర్లు కలిసి ఈ నగరానికి ఆ పేరు తెచ్చిపెట్టాయి. భారత నిట్‌వేర్ ఎగుమతుల్లో దాదాపు 55-60 శాతం వాటా ఒక్క తిరుప్పూర్‌దే. గత ఏడాది అమెరికా.. భారత వస్తువులపై 50 శాతం సుంకం విధిస్తుందన్న భయం, ఈ నగరంలో పెద్ద కలకలం రేపింది. ఆర్డర్లు రద్దయ్యాయి, ఎగుమతిదారులు తమ అతిపెద్ద మార్కెట్‌ను కోల్పోతామేమోనన్న భయంతో వణికిపోయారు. అత్యధిక సుంకాల షాక్ తీవ్రంగా ఉన్న సమయంలో, వలస కాంట్రాక్ట్ కార్మికులే మొదట బాధితులయ్యారు. చాలామందిని ఉద్యోగాలనుంచి తీసేయగా, పరిశ్రమలు నిరుపయోగంగా ఉన్న కార్మికులకు జీతాలు చెల్లించలేక, తమ మూటాముల్లె సర్దుకుని ఉత్తరాదికి రైళ్లు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనేక యూనిట్లు మూతపడ్డాయి, మరికొన్ని కుంచించుకుపోయాయి. 2025 ఆగస్టు నుంచి డిసెంబర్ వరకూ సాగిన ఈ సంక్షోభం, 2026 ప్రారంభంలో తాత్కాలికంగా కొంత కోలుకున్నప్పటికీ, ఎగుమతి యూనిట్లు ఇప్పటికీ తమ శ్రామికశక్తిని పునర్వ్యవస్థీకరిస్తూనే ఉన్నాయి. ఇప్పుడు సరిగ్గా ఏడాది తర్వాత, ఆంక్షలు, సుంకాల నీడ మళ్లీ వెనక్కి వచ్చింది. సెప్టెంబర్ 18న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'లిండ్సే ఓ గ్రాహం రష్యా, ఇరాన్‌లపై ఆంక్షల చట్టం-2026'పై సంతకం చేయడంతో, రష్యా చమురు, గ్యాస్ దిగుమతి చేసుకునే దేశాలపై వందశాతం వరకూ సుంకాలు విధించే మార్గం తెరుచుకుంది.

వంద శాతం సుంకం విధిస్తే, అమెరికా మార్కెట్‌పై ఆధారపడిన తిరుప్పూర్ వంటి ఎగుమతి కేంద్రాలపై దాని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. గత ఏడాది తిరుప్పూర్ ఎగుమతుల్లో దాదాపు 30-35 శాతం అమెరికాకే వెళ్లాయి కాబట్టి, మళ్లీ అనిశ్చితి మొదలైంది. కాని, ఇప్పుడు తిరుప్పూర్ వాతావరణం శాంతంగానే ఉంది. "గత ఏడాది సుంకాల బెదిరింపులు, భౌగోళిక-రాజకీయ కల్లోలం, ఆర్డర్లు నిలిచిపోవడం, రద్దవడం.. ఇదొక రోలర్ కోస్టర్ రైడ్‌లా సాగింది. కానీ నేను ఆశావాదిగానే ఉన్నాను" అని తిరుప్పూర్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ (టీఈఏ) కార్యనిర్వాహక కార్యదర్శి దినేష్ బాబు రవికృష్ణన్ అన్నారు. ఎందుకంటే, తిరుప్పూర్ ఎగుమతిదారులు ఒక్క మార్కెట్‌పైనే ఆధారపడటం మానుకున్నారు. దానికి ఇప్పుడు బ్రిటన్, యూరప్ కొత్త మార్కెట్లవుతున్నాయి. 2026 జులై 15న అమల్లోకి వచ్చిన భారత్-బ్రిటన్ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ), భారత ఎగుమతుల్లో 99 శాతానికి సుంకం రహిత ప్రవేశాన్ని కల్పించడంతో, బంగ్లాదేశ్, వియత్నాంవంటి పోటీదారుల కంటే భారత తయారీదారులకు మెరుగైన పోటీతత్వాన్ని అందిస్తోంది. రష్యా చమురు కొనుగోలుదారులను లక్ష్యంగా చేసుకున్న కొత్త అమెరికా చట్టం గురించి ఆందోళన చెందుతున్నప్పటికీ, షాక్‌లను జీర్ణించుకోవడం నేర్చుకున్నారు. ఎగుమతిదారులు మార్కెట్లను, ఉత్పత్తులను వైవిధ్యపరుస్తున్నారు, ఆర్డర్లను ముందుకు తీసుకువస్తున్నారు, అంతరాయం ఇక మినహాయింపు కాదన్న ప్రపంచానికి సిద్ధమవుతున్నారు. కొన్ని ఎగుమతి యూనిట్లు ఉత్పాదకతను పెంచుకునేందుకు, ఖర్చులు తగ్గించుకునేందుకు ఆటోమేషన్‌వైపు మళ్లుతున్నాయి. 2027 వసంతకాల ఆర్డర్లను ముందుగానే త్వరితం చేసి రవాణా చేసేందుకు భారత దుస్తుల ఎగుమతిదారుల మధ్య ఒక 'ఫుల్-ఫార్వర్డ్' పోటీ నడుస్తోందని వార్తా నివేదికలు చెబుతున్నాయి. తాము నియంత్రించలేని 'కల్లోలాన్ని' ఫేస్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పత్తిపైనే సాంప్రదాయకంగా ఎక్కువగా ఆధారపడిన తిరుప్పూర్ నిట్‌వేర్ పరిశ్రమ, ఇప్పుడు ఉద్భవిస్తున్న అంతర్జాతీయ ఎగుమతి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు పత్తి, కృత్రిమ ఫైబర్ (ఎంఎంఎఫ్) ఉత్పత్తుల మిశ్రమం వైపు వైవిధ్యపరచుకునే ప్రయత్నం చేస్తోందని రవికృష్ణన్ చెప్పారు.

తిరుప్పూర్ దుస్తుల పరిశ్రమలో పనిచేస్తున్న దాదాపు పది లక్షల కార్మికుల్లో.. సగంమంది వలస కార్మికులే. అనుభవజ్ఞులైన స్థానిక తమిళులు, ఉత్తరాది వలస కార్మికులు రొటీన్ పనితో విసిగిపోయి వెళ్లిపోతుంటే.. కొన్ని ఎగుమతి యూనిట్లు కార్మిక కొరత ఎదుర్కొంటున్నాయి. దీనికితోడు కొత్త సుంకాల బెదిరింపు ఉన్నా.. ఉత్తర భారతంనుంచి వలస కార్మికులు ఇప్పటికీ వస్తూనే ఉన్నారు. వీరిలో అధికులు బిహార్ నుంచే వస్తున్నారు, క్రమంగా తమ కుటుంబాలను, పిల్లలను కూడా తీసుకొస్తున్నారు. ఈ వలస పిల్లలకు అనధికారిక తరగతుల ఏర్పాటుకూ కొన్ని సంస్థలు ప్రయత్నిస్తున్నాం. ఈశాన్య రాష్ట్రాలు, ఒడిశానుంచి యువ ఒంటరి మహిళలు కూడా పనికోసం వస్తూనే ఉన్నారు, ఫ్యాక్టరీ హాస్టళ్లలో నివసిస్తున్నారు.

ఇది అస్థిరమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో జీవితం ఎలా ఉంటుందో చూపే ఒక చిన్న, అర్థవంతమైన చిత్రం. రష్యా చమురు గురించి అమెరికా తీసుకునే ఒక నిర్ణయం, భారత ఎగుమతిదారుడి ఆర్డర్ బుక్‌ను మార్చేయగలదు. ఆ ఎగుమతిదారుడు యూరోపియన్ లేదా బ్రిటిష్ కొనుగోలుదారుడి కోసం వెతకడం ద్వారా, లేదా పత్తి నుంచి సింథటిక్స్‌కు మారడం ద్వారా స్పందిస్తాడు. బిహార్ నుంచి ఒక వలస కుటుంబం అయినప్పటికీ తిరుప్పూర్‌కు తరలివస్తుంది. ఈ మొత్తం వ్యవహారం మధ్యలో ఎక్కడో, ఒక ఎన్జీవో కార్యకర్త ఆ వలస పిల్లలు స్కూలుకు ఎలా వెళ్తారో కనిపెట్టాల్సి ఉంటుంది. కర్మాగారాలు వైవిధ్యపరచుకోగలవు. మార్కెట్లు మారవచ్చు. ఆర్డర్లను ముందుకు తీసుకురావచ్చు లేదా నిలిపివేయవచ్చు. కానీ పిల్లలు మాత్రం చదువుకోవాల్సిందే. 'సుంకాలు', 'ఆంక్షలు' అనే భాష కొన్నిసార్లు నేలపై నిజంగా ఏం జరుగుతుందో మరుగుపరచగలదు. ఇవి కేవలం ప్రభుత్వాలు ప్రభుత్వాలపై వాడే సాధనాలు మాత్రమే కాదు. భౌగోళిక-రాజకీయ రిస్క్ ఇప్పుడు నిత్య వాణిజ్య ప్రణాళికలో ఒక భాగంగా మారుతోంది. బ్రిటన్, యూరప్ కొత్త అవకాశాలను అందిస్తున్నప్పటికీ, ఈ మార్కెట్లలోకి పెద్ద ఎత్తున ప్రవేశించడం అంత సులభం కాదు. వైవిధ్యీకరణకు పెట్టుబడి కావాలి, సింథటిక్ ఫైబర్‌లలోకి మారాలంటే కొత్త సామర్థ్యాలు కావాలి, కొత్త మార్కెట్లను కనుగొనడానికి టైం పడుతుంది. అతి చిన్న సంస్థలు, తక్కువ భద్రత కలిగిన కార్మికులకు మరో అంతరాయాన్ని తట్టుకునే వెసులుబాటు తక్కువ. తిరుప్పూర్‌లో కనిపిస్తున్న ప్రశాంతతను నిర్లక్ష్యంగా భావించకూడదు. ఇది పాత అంచనాలపై ఇక ఆధారపడలేమని నేర్చుకున్న ఒక ప్రాంతపు ప్రశాంతత. టీఈఏకు చెందిన రవికృష్ణన్ చెప్పినట్టుగా, "స్థిరమైన మార్కెట్లు అంటూ ఏవీ లేవు." తిరుప్పూర్ బయటి ప్రపంచం ఈ కొత్త సుంకాల బెదిరింపును భారత్-అమెరికా చర్చలు, రష్యా చమురు, భౌగోళిక-రాజకీయ పైచేయి పరంగా చర్చించవచ్చు. కానీ ఈ ఎగుమతి కేంద్రం లోపల మాత్రం, ఇది మరింత ఆచరణాత్మకమైన కథ - వీలైనంత ఎగుమతి చేయండి, వేరే మార్కెట్లను వెతకండి, భిన్నమైనదాన్ని తయారుచేయండి, వీలైనచోట ఆటోమేట్ చేయండి, ముందుకు సాగుతూనే ఉండండి. ■

---



మనం ఎంతగానో ఇష్టపడే వారిని కాపాడుకోవడానికి మనవంతుగా సాధ్యమైన పనులన్నీ చేసినప్పటికీ.. కొన్నిసార్లు వారిని కోల్పోక తప్పదు. సర్దుకుపోవడం, క్షమించడం వంటి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆ బంధాలు ముగిసిపోవచ్చు. కానీ ఒక బంధం ముగియడం అంటే మీరు విఫలమైనట్లు కాదు.. ఇద్దరి దారులు, భవిష్యత్తు వేరని అర్థం. ఒక చెట్టుకుండే ఏ రెండు కొమ్మలూ ఒకే దిశగా పెరగవు. అలాగే మనసులు కలిసినా.. ప్రయాణాలు ఎప్పుడూ కలిసి సాగకపోవచ్చు. బంధం ముగిసిందని బాధపడటం సహజమే.. కానీ కొన్నిసార్లు విడిపోవడమే ఇద్దరికీ కొత్త దారిని చూపిస్తుంది.

-మహాదేవ

---

### వింతల్లో వింతలు

## మారువేషం.. 'మహిళ' జీవితం!



దొంగతనాలు చేస్తూ ప్రభుత్వ అధికారిగా నటించిన టర్కీకి చెందిన తుగ్రుల్ బషార్‌కు 2018లో మూడేళ్ల జైలు శిక్ష ఖరారవగానే, అతను అదృశ్యమయ్యాడు. ఎనిమిదేళ్ల పాటు పోలీసులకు చిక్కకుండా తప్పించుకున్న ఇతను, ఇటీవల ఇస్తాంబుల్‌లో పూర్తిగా భిన్నమైన రూపంలో, సొంత సోదరి గుర్తింపుతో జీవిస్తూ దొరికిపోయాడు! ఇతని రూపమార్పిడి ఎంతంటే.. పాత మగ్‌షాట్‌లతో గుర్తుపట్టడం పోలీసులకు అసాధ్యమైంది. చివరికి వేలిముద్రల పరీక్షతోనే అసలు నిజం బయటపడింది. అరెస్ట్ అయినప్పుడు సోదరి ఐడీ కార్డే అతని దగ్గర ఉంది! అధికారిక రికార్డుల్లో లింగమార్పు నమోదు చేయించుకోనందున, ఇప్పుడు ఇతన్ని పురుషుల జైలుకే తరలించనున్నారు.

# జ్వరం శత్రువు కాదు



ఆశ్చర్యంగా అనిపించినా జ్వరం శత్రువు కాదు. మనల్ని కాపాడే, ఆపదల గురించి అప్రమత్తం చేసే మిత్రుడే! మనం జ్వరాన్ని ఒక జబ్బుగా భావిస్తుంటాం గానీ నిజానికిది ఓ లక్షణం మాత్రమే. శరీరం లోపలేదో జబ్బుతో పోరాడుతోందనటానికి ఒక సంకేతమే. ఇన్‌ఫెక్షన్లు, క్యాన్సర్లు, స్వీయరోగనిరోధక జబ్బులు.. ఇలా రకరకాల సమస్యల్లో జ్వరం రావచ్చు. కారణాన్ని గుర్తించమని ఇది తరచూ హెచ్చరిస్తూనే ఉంటుంది. దీన్ని ఎప్పుడు తేలికగా తీసుకోవాలో, ఎప్పుడు అత్యవసర చికిత్స అవసరమో తెలుసుకోవటంలోనే ఉంది అసలైన విజ్ఞత.

జ్వరం అంటే? శరీర ఉష్ణోగ్రత నార్మల్ కన్నా పెరగటం. నార్మల్ శరీర ఉష్ణోగ్రత అనేది అందరిలో ఒకేలా ఉండాలని లేదు. కొందరిలో ఎక్కువ, తక్కువ ఉండొచ్చు. కానీ సాధారణంగా సుమారు 98.6 డిగ్రీల ఫారన్‌హీట్ ఉష్ణోగ్రతను నార్మల్‌గా భావిస్తుంటారు. రక్తం వేడిగా ఉండే మనలాంటి జీవుల్లో శరీర ఉష్ణోగ్రత స్థిరంగా ఉంటుంది. బయటి ఉష్ణోగ్రతతో సంబంధం లేకుండా ఒకేలా కొనసాగుతుంది. వాతావరణం వేడిగా ఉన్నప్పుడు చెమట పోయటం ద్వారా చల్లబడుతుంది. చల్లగా ఉన్నప్పుడు చెమట పట్టకుండా చూడటం ద్వారా వెచ్చగా ఉంటుంది. ఈ ప్రక్రియను మన మెదడులోని హైపోథలమస్ నిరంతరం నియంత్రిస్తుంటుంది. జ్వరం రావటం లోనూ దీని పాత్రే కీలకం. చాలా జ్వరాలకు ఇన్‌ఫెక్షన్లే కారణం. వీటికి దారితీసే బ్యాక్టీరియా, వైరస్ వంటి వ్యాధి కారకాలు ఒంట్లోకి ప్రవేశించినప్పుడు రోగనిరోధక వ్యవస్థ వాటిని గుర్తించి, మెదడుకు సంకేతాలు పంపిస్తుంది. దీంతో మెదడు శరీర ఉష్ణోగ్రత పెంచాలంటూ హైపోథలమస్‌ను పురమాయిస్తుంది. అప్పుడది శరీర ఉష్ణోగ్రత లక్ష్యాన్ని పెంచుతుంది. దీన్ని చేరుకోవటానికి చర్మం సమీపంలోని రక్తనాళాలు సంకోచించి, ఒంట్లోంచి వేడి బయటకు పోవటం ఆగుతుంది. అలాగే కండరాలు వేగంగా సంకోచించటం వల్ల ఉష్ణోగ్రత పెరిగి, పైస్థాయికి చేరుతుంది. దీని మూలంగానే వణుకు పుడుతుంటుంది. ఇదంతా వ్యాధి కారకాల పనిపట్టే ప్రక్రియలో భాగమే. అంటే జ్వరం శత్రువు కాదు. కాస్త ఇబ్బంది పెట్టినా మనల్ని కాపాడటానికి తోడ్పడే మిత్రుడన్నమాట.

### అత్యవసర చికిత్స ఎప్పుడు?

మూడు నెలల కన్నా తక్కువ వయసు పిల్లలకు జ్వరం వస్తే తాత్సారం చేయరాదు. వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఇతర పిల్లల్లోనైతే మామూలుగా పాలు తాగుతూ, ఆహారం తీసుకుంటూ, ఆడుకుంటూ, తిరుగుతున్నట్టయితే ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఒకవేళ చికాకు, అసౌకర్యానికి గురవుతుంటే డాక్టర్ సలహా మేరకు పారాసిటమాల్ మందు ఇవ్వచ్చు. బ్యాక్టీరియా, వైరస్‌లు ఉద్ధృతంగా ఉన్న తొలిదశలో దీంతో వెంటనే ఉష్ణోగ్రత పూర్తిగా నార్మల్‌కు రాకపోవచ్చు. అయినా హాయిగా ఉండటానికి తోడ్పడతాయి. అయితే..

### మందు వేసినా ఉపశమనం కలగకపోయినా

నీటిశాతం తగ్గిన లక్షణాలు కనిపించినా.. అంటే 8 నుంచి 10 గంటల పాటు మూత్రం పోయకపోయినా, ఏడ్చినప్పుడు కన్నీళ్లు రాకపోయినా, నోరు ఎండిపోయినా, ద్రవాలు తీసుకోవటానికి నిరాకరించినా

మెడ బిగువుగా అయినా లేదా తలనొప్పి వస్తున్నా

ఎప్పుడూ మగతగా ఉంటున్నా

శ్వాస తీసుకోవటానికి ఇబ్బంది పడుతున్నా

చర్మం మీద దద్దు కనిపించినా

కీళ్ల వాపు, నొప్పి ఉన్నా

ఐదు రోజులైనా జ్వరం తగ్గకపోయినా

అత్యవసరంగా ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిందే.

### పెద్దవారిలోనైతే..

శ్వాస సరిగా తీసుకోలేకపోవటం

ఛాతీ నొప్పి

తీవ్రమైన తలనొప్పి, మెడ బిగుసుకోవటం

తికమక పడటం

కడుపు నొప్పి

తరచూ వాంతులు

నోరు ఎండిపోవటం, మూత్రం ముదురు రంగులోకి మారటం, ద్రవాలు తీసుకోలేకపోవటం

చర్మం మీద దద్దు

ద్రవాలు మింగలేకపోవటం

మూత్రం పోస్తున్నప్పుడు నొప్పి

వీపులో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే సత్వరం ఆసుపత్రికి వెళ్లాలి.

టైఫాయిడ్ కాకపోవచ్చు

మనదగ్గర జ్వరం అనగానే టైఫాయిడ్ అనే అనుకుంటారు. అందుకే చాలాచోట్ల ముందుగా వైడాల్ పరీక్ష చేస్తుంటారు. కాకపోతే ఇది చాలామందిలో ఫాల్స్ పాజిటివ్.. అంటే జబ్బు లేకపోయినా ఉన్నట్టుగా కనిపిస్తుంటుంది. దీంతో టైఫాయిడ్ లేకపోయినా డాక్టర్లు మందులు ఇస్తుంటారు. దీంతో యాంటీబయాటిక్ నిరోధకత, ఇతర దుష్ప్రభావాలు తలెత్తుతాయి.

### మేలు ఇలా..

బ్యాక్టీరియా, వైరస్ వంటి వ్యాధి కారకాలు నార్మల్ ఉష్ణోగ్రతను బాగా తట్టుకుంటాయి. అదే జ్వరంలోనైతే వీటి మనుగడ కష్టమవుతుంది. అవి చనిపోవటం మొదలవుతుంది లేదా వృద్ధి చెందటం నెమ్మదిస్తుంది. అధిక ఉష్ణోగ్రతలో మన రోగనిరోధక వ్యవస్థ మరింత వేగంగానూ పనిచేస్తుంది. మ్యాక్రోఫేజెస్, తెల్ల రక్తకణాలు, లింఫోసైట్ల వంటి 'సైనిక' కణాలు ఉత్పత్తయ్యేలా, అవి ఇన్‌ఫెక్షన్ ఉన్న చోటుకు త్వరగా వెళ్లేలా పురమాయిస్తుంది. యాంటీబాడీలను ఉత్పత్తి చేసే టి కణాలు ఎక్కువగా వృద్ధి చెందేలా చేస్తుంది. అందువల్ల ఇన్‌ఫెక్షన్లు త్వరగా తగ్గుతాయి. ఉష్ణోగ్రత పెరిగిన వెంటనే జ్వరాన్ని తగ్గించే మందులు వేసుకుంటే ఈ రక్షణ ప్రక్రియ నెమ్మదిస్తుంది. బ్యాక్టీరియా, వైరస్ వేగంగా పెరుగుతాయి. అవి రోగనిరోధక వ్యవస్థను తట్టుకునేలా మారతాయి. దీంతో ఇన్‌ఫెక్షన్లు ఎక్కువ కాలం కొనసాగుతాయి. అలాగని జ్వరాన్ని అసలే తగ్గించకూడదని కాదు. ఇన్‌ఫెక్షన్ కారకాన్ని గుర్తించి, తగు చికిత్స చేయటం ముఖ్యమన్నమాట. ఒక్క జ్వరం తగ్గే మందులు మాత్రమే వాడితే అప్పటికి ఉపశమనం కలగొచ్చు గానీ దీనికి మూలమైన ఇన్‌ఫెక్షన్ అలాగే ఉంటుంది.

### మూడు రకాలు

కొందరు ఒళ్లు కాస్త వెచ్చగా, నోరు చేదుగా అనిపించగానే లోజ్వరం ఉందని భావిస్తుంటారు. జ్వరం లేకపోయినా ఉందనుకుంటుంటారు. థర్మామీటరుతో చూసుకుంటేనే అసలు విషయం తెలుస్తుంది. చంకలో థర్మామీటర్ కొలత 99 ఫారన్‌హీట్ డిగ్రీలు, అంతకన్నా ఎక్కువ.. నోట్లో, మలద్వారంలో, చెవిలో కొలత 100.4, అంతకన్నా ఎక్కువుంటే జ్వరంగా భావించాలి. ఉష్ణోగ్రత తీరును బట్టి దీన్ని మూడు రకాలుగా చెప్పుకోవచ్చు.

మామూలు: 102 డిగ్రీల ఫారన్ హీట్ కన్నా తక్కువ

ఒక మాదిరి: 102 నుంచి 104

తీవ్రం: 104 డిగ్రీలు మించితే

### ఇవీ లక్షణాలు

ఒళ్లు వేడిగా ఉండటం

శ్వాస వేగంగా తీసుకోవటం

వణుకు

నాడి వేగం పెరగటం

ఒళ్లు నొప్పులు

తిండి సరిగా తినకపోవటం (ముఖ్యంగా పిల్లల్లో)

ఇలా తగ్గించుకోవాలి

జ్వరం తీవ్రంగా ఉంటే ఎవరికైనా ఆందోళన కలుగుతుంది. కానీ ఇంట్లో సురక్షితమైన పద్ధతులను పాటించటం ద్వారా త్వరగా తగ్గేలా చూసుకోవచ్చు.

### 1. నీరు-ఆహారం

జ్వరం వచ్చినప్పుడు ఒంట్లో నీరు తగ్గుతుంది. కాబట్టి తగినంత నీరు, ద్రవాలు తీసుకోవాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం తినాలి. పండ్లు, కూరగాయలు తీసుకోవచ్చు. పప్పులతో ప్రొటీన్ లభిస్తుంది. ఇది త్వరగా కోలుకోవటానికి తోడ్పడుతుంది. మాంసాహారులైతే చికెన్ వంటివి తినొచ్చు. అయితే కూల్‌డ్రింకులు, కెఫీన్‌కు దూరంగా ఉంటే మంచిది.

### 2. విశ్రాంతి-నిద్ర

విశ్రాంతి తీసుకుంటే రోగనిరోధక వ్యవస్థ పనిచేయటానికి మరింత శక్తి లభిస్తుంది. పెద్దవాళ్లు రోజుకు 7-8 గంటలు నిద్రపోయేలా చూసుకోవాలి. పిల్లలకైతే ఇంకా ఎక్కువ నిద్ర అవసరం. రాత్రి సరిగా నిద్ర పట్టకపోతే పగటి పూట కునుకు తీయొచ్చు.

### 3. ఒళ్లు చల్లబడేలా

నుదురు మీద తడి బట్ట వేయాలి. తడి తువ్వాలుతో ఒళ్లంతా తుడవాలి. ఐస్ బ్యాగుతోనైనా అద్దుకోవచ్చు. జ్వరం మరీ ఎక్కువగా ఉంటే చంకల్లో, గజ్జల్లో తడి తువ్వాలు, ఐస్ ముక్కలు పెట్టొచ్చు. ఫ్యాన్లు, వీలుంటే ఏసీ వేసుకుంటే మంచిది.

### 4. మాత్రలు-మందులు

పారాసిటమాల్ మాత్రలు, పిల్లలకైతే సిరప్ మేలు చేస్తాయి. ఇవి జ్వరం తగ్గటానికి తోడ్పడతాయి. ఒకవేళ జ్వరం మరీ తీవ్రంగా ఉండి, మాత్రలు మింగలేని స్థితిలో ఉంటే ఇంజెక్షన్ రూపంలో ఇవ్వచ్చు. అయితే ఐబూప్రోఫెన్, డైక్లోఫెనాక్ వంటి నొప్పి మందులు వాడొద్దు. వర్షాకాలంలో వైరల్ జ్వరాలు ఎక్కువ కాబట్టి ఇది మరింత ముఖ్యం. వీటితో ప్లేట్‌లెట్లు తగ్గటం, రక్తస్రావం వంటి దుష్ప్రభావాలు తలెత్తుతాయి. కొందరికి కిడ్నీలు దెబ్బతినొచ్చు కూడా. పిల్లలకు ఆస్ప్రిన్ ఇవ్వద్దు.

### 5. గది సరిగా

గదిలోకి గాలి వచ్చి పోయేలా, వేడి ఎక్కువగా లేకుండా చూసుకోవాలి. అసౌకర్యం కలగకుండా వెలుతురు తగ్గించుకోవాలి. నీళ్లు, టిష్యూ పేపర్లు అందుబాటులో ఉండేలా మంచానికి దగ్గరగా పెట్టుకోవాలి.

# రోజువారీ ఇవి అందేలా చూసుకుంటే.. జుట్టు రాలడాన్ని నివారించవచ్చు!

**శిరోజాలకు పోషకాల అవసరం ఎంతో**

**బయోటిన్, విటమిన్ ఈ, సీ, ఏ అందేలా చూసుకోవాలి**

**ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ తోనూ ప్రయోజనం**



శిరోజాలు రాలిపోవడం వెనుక ఎన్నో కారణాలు ఉంటాయి. పోషకాలు లోపించొచ్చు. లేదంటే ఒత్తిడి, ఆందోళన కారణం కావచ్చు. హార్మోన్లలో మార్పులతోనూ శిరోజాలు రాలిపోయే సమస్య ఎదురవుతుంది. అయితే కారణాన్ని గుర్తిస్తే ఈ సమస్యను సులభంగానే నయం చేసుకోవచ్చు. నివారించలేని సమస్య ఇది కానే కాదు. ముఖ్యంగా శిరోజాలకు బలాన్నిచ్చే ముఖ్యమైన పోషకాలు కొన్ని ఉన్నాయి. వీటిని రోజువారీ ఆహారం రూపంలో అందేలా చూసుకోవాలి.

### బయోటిన్

ఇది బీ 7 విటమిన్. ఇది లోపించడం వల్ల శిరోజాలకు బలం తగ్గుతుంది. బయోటిన్ లోపించినప్పుడు జుట్టు కుదుళ్లకు సరిపడా ఆక్సిజన్ సరఫరా కాదు. దీంతో జుట్టు కుదుళ్లు బలహీనపడతాయి. దాంతో జుట్టు రాలుతుంది. 18 ఏళ్లు నిండిన వారు ప్రతి రోజూ 30 ఎంసీజీ నుంచి 100 ఎంసీజీ వరకు బయోటిన్ అందేలా చూసుకోవాలి. బయోటిన్ కొంచెం ఎక్కువైనా మూత్రం ద్వారా విసర్జితం అవుతుంది.

### విటమిన్ ఏ

సాధారణంగా విటమిన్ ఏ అంటే కంటి ఆరోగ్యానికే అనుకుంటుంటాం. కానీ, ఇది శిరోజాల ఎదుగుదలకూ ముఖ్యమే. విటమిన్ ఏ ఎక్కువైనా ప్రమాదమే. అందుకని రోజులో 900 ఎంసీజీ పరిమాణం మించకుండా విటమిమన్ ఏ తీసుకోవచ్చు. ఎక్కువ తీసుకుంటే అదనపు మొత్తాన్ని మన శరీరం మూత్రం ద్వారా బయటకు పంపలేదు. శరీరంలోనే నిల్వ చేసుకుంటుంది. కనుక మోతాదు మించకూడదు.

### ఐరన్

మన శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్ ను ఎర్ర రక్త కణాలు చేరవేస్తాయి. అప్పుడు జీవక్రియలు సాఫీగా నడుస్తాయి. కనుక ప్రతి ఒక్కరూ ఐరన్ లోపం లేకుండా చూసుకోవాలి. ఐరన్ లోపిస్తే జుట్టు కూడా రాలిపోతుంది. రోజులో పెద్దవారు గరిష్ఠంగా 45 ఎంజీ మించకుండా ఐరన్ అందేలా చూసుకోవాలి.

### ఒమెగా 3

ఇవి మంచి కొవ్వులు. జుట్టు ఎదిగేందుకు సైతం ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉపయోగపడుతాయి. జుట్టు రాలిపోతున్న వారికి ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్, 6 యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లను ఇచ్చి చూసినప్పుడు మంచి ఫలితాలు కనిపించాయి.

### విటమిన్ డీ

విటమిన్ డీ లోపం అలోపీసియాకు దారితీస్తుంది. అంటే మహిళల్లో బట్టతలను ఇలా చెబుతారు. వెంట్రుకలకు సంబంధించి కొత్త ఫాలికల్స్ ఏర్పడడంలో విటమిన్ డీ ప్రభావం ఉంటుందని ఓ అధ్యయనంలో వెల్లడైంది. పెద్దలు రోజువారీ 600 ఐయూల మేరకు విటమిన్ డీ అందేలా చూసుకోవాలి.

### విటమిన్ ఈ

విటమిన్ ఈ కూడా జుట్టు ఆరోగ్యంగా ఎదిగేందుకు అవసరం. ఇది లోపించినా జుట్టు రాలిపోవచ్చని పలు అధ్యయనాలు వెల్లడించాయి. రోజువారీగా 3-4 ఎంజీ మేర తీసుకోవచ్చు.

### విటమిన్ సీ

వ్యాధి నిరోధక శక్తిని విటమిన్ సీ పెంచుతుంది. చర్మం, శిరోజాల ఆరోగ్యానికి కారణమయ్యే కొల్లాజెన్ ను పెంచుతుంది. రోజులో 50-75 ఎంజీ మధ్య విటమిన్ సీని ఆహారం ద్వారా అందేలా చూసుకోవాలి. పోషకాల లోపం లేకుండా జాగ్రత్త పడిన తర్వాత కూడా జుట్టు రాలే సమస్య తగ్గకపోతే.. అప్పుడు వైద్యుల సలహా అవసరపడుతుంది.

# ఇంట్లో మొక్కలు పెంచితే.. బోలెడన్ని ప్రయోజనాలు

**గాలిని శుభ్రం చేసే శక్తి మొక్కలకు ఉంది**

**వీటి నుంచి అదే పనిగా స్వచ్ఛమైన ఆక్సిజన్ విడుదల**

**ఒత్తిడి, ఆందోళన నుంచి ఉపశమనం**

**ఇంటి మొక్కలతో నాణ్యమైన నిద్ర, ఆరోగ్యం**

కొందరు ఇంట్లో కొంచెం ఖాళీ స్థలం ఉన్నా దాన్ని మొక్కలతో నింపేస్తారు. పూల కుండీల్లో తమకు నచ్చిన మొక్కలను పెంచుకుంటూ, ప్రాణంగా చూసుకుంటారు. మొక్కలపై, పర్యావరణంపై ప్రేమతోనే అనుకోకండి. మొక్కలను పెంచడం వల్ల అదనంగా మనకూ ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఈ మధ్య సోషల్ మీడియాలో ఒక అంశం తెగ ట్రెండింగ్ అయింది. కూలర్ లో నీళ్లు పోస్తున్న ఫొటోను పెట్టి.. 'మొక్కలకు నీళ్లు పోస్తే ఈ అవస్థ తప్పేదిగా' అంటూ క్యాప్షన్ పెట్టారు. ఇది చాలా మందిని ఆలోచింపచేసింది. ఇందులో నిజంగా ఎంతో అర్థం ఉండడంతో తెగ షేర్ కూడా అయింది. అవును నిజమే, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటికి నీళ్లు పోసి, అవి చెట్లుగా మారితే బతికి ఉన్నంత కాలం అవి మనకు నీడను ఇవ్వడమే కాదు. ఎంతో కాలుష్యాన్ని తగ్గిస్తాయి. వేడి నుంచి ఉపశమనాన్ని, పర్యావరణ కాలుష్యం నుంచి రక్షణనిచ్చే చెట్లకు ప్రాధాన్యం ఇవ్వడం చాలా అవసరం.

### వాయు నాణ్యత

ఇంట్లో ఎయిర్ ప్యూరిఫయర్ అవసరం నేడు ఎంతో ఉంది. దీనికి కారణం వాయు, పారిశ్రామిక కాలుష్యం అధికం కావడమే. ఇంట్లో ఒక ప్యూరిఫయర్ ఉంటే ఎంత మేలు చేస్తుందో తెలియదు కానీ, ఒక్క చెట్టు ఉంటే అంతకంటే ఎక్కువ మేలు చేస్తుందని చెప్పొచ్చు. మొక్కలు సహజంగానే గాలిని ఫిల్టర్ చేసే సాధనాలు. గాల్లోంచి హాని కారకాలను తొలగిస్తాయి. ఇంట్లోని కుండీల్లో పెంచుకునే స్పైడర్ ప్లాంట్స్, పీస్ లిల్లీస్ తదితర మొక్కలు హానికారక టాక్సిన్లను తొలగిస్తాయి. ఇంట్లో గాలి



నాణ్యతను పెంచుతాయి.

### ఒత్తిడి, ఆందోళన నుంచి ఉపశమనం

ఇంట్లో మొక్కలతో మరో ప్రయోజనం మనలో ఒత్తిడి తగ్గుతుంది.

ఆందోళన కూడా ఉపశమిస్తుంది. ఎందుకంటే మొక్కల నుంచి స్వచ్ఛమైన ఆక్సిజన్ విడుదల అవుతుంది. అది మనసుకు ఉల్లాసాన్నిస్తుంది. మొక్కలు చుట్టూ ఉంటే మరింత సమర్థవంతంగా పనిచేస్తారని, జ్ఞాపకశక్తికి చురుగ్గా మారుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. మెదడుపై మొక్కలు చూపించే సానుకుల ఫలితాలే దీనికి కారణం.

### వ్యాధి నిరోధక శక్తి

ఇంట్లో పెంచుకునే మొక్కలతో వ్యాధి నిరోధక శక్తి బలపడుతుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. మొక్కలు ఫైటోసైడ్స్ ను విడుదల చేస్తాయి. బ్యాక్టీరియా, వైరస్ పై పోరాడడంలో సాయపడే సహజ రసాయనం ఫైటోసైడ్స్.

### నాణ్యమైన నిద్ర

మొక్కలు మన నిద్ర నాణ్యతను కూడా పెంచుతాయి. ఎందుకంటే మొక్కల నుంచి మనకు చక్కని ఆక్సిజన్ అందడం వల్ల నిద్ర నాణ్యత మెరుగు పడుతుంది. ఒత్తిళ్లు కూడా తగ్గుతాయి. కనుక మంచి నిద్ర సాధ్యపడుతుంది.

# ఆసియా క్రీడల్లో గుల్వీర్ సింగ్ సత్తా.. 10,000 మీటర్లలో సిల్వర్ మెడల్!




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత లాంగ్ డిస్టెన్స్ రన్నర్ గుల్వీర్ సింగ్ మరోసారి తన సత్తా ఏంటో ప్రపంచానికి చాటి చెప్పారు. 2026 ఆసియా క్రీడలలో పురుషుల 10,000 మీటర్ల ఫైనల్స్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ హోరాహోరీ రేసును ఆయన కేవలం 28:29.38 నిమిషాల టైమింగ్‌తో పూర్తి చేసి ట్రెండింగ్‌లో నిలిచారు.

**గుల్వీర్ సక్సెస్ జర్నీ:**
అంతర్జాతీయ వేదికలపై గుల్వీర్ సింగ్ తన పరుగుతో తిరుగులేదని నిరూపిస్తున్నారు. ఈ తాజా గెలుపుతో ఆయన తన కెరీర్‌లో మరో భారీ అంతర్జాతీయ పతకాన్ని జమ చేసుకున్నారు. సరిగ్గా చెప్పాలంటే, గతంలో 2023లో జరిగిన హాంగ్జౌ ఏషియన్ గేమ్స్‌లోనూ అతడు కాంస్య పతకం సాధించి అదరగొట్టారు.

**గుల్వీర్ సింగ్ పతకాలు:**
ఇటీవలే ముగిసిన 2026 కామన్వెల్త్ గేమ్స్‌లోనూ గుల్వీర్ అదరగొట్టారు. అక్కడ 27:49.78 సమయంలో రేసును పూర్తి చేసి రజత పతకాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఇక రికార్డుల విషయానికి వస్తే.. 2025లో ఏకంగా 27:00.22 సమయంలో లక్ష్యాన్ని చేరుకుని జాతీయ 10,000 మీటర్ల రికార్డును తన పేరిట లిఖించుకున్నారు. అంతకంటే ముందు గత ఏడాదే ఏషియన్ టైటిల్‌ను కూడా కైవసం చేసుకున్నారు. దీంతో ఆసియా ఖండంలోనే టాప్ డిస్టెన్స్ రన్నర్లలో ఒకరిగా తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు.

**ఇండియన్ అథ్లెటిక్స్ గర్వించదగ్గ స్టార్:**
అంతర్జాతీయ గేమ్స్ లో వరుస విజయాలతో దూసుకుపోతున్న గుల్వీర్ సింగ్, ఈ ఆసియా క్రీడలలోనూ తన సూపర్ ఫామ్‌ను కంటిన్యూ చేశారు. ఈ తాజా పోడియం ఫినిష్‌తో అతడు అంతర్జాతీయ వేదికలపై భారత్ కీర్తిని మరో మెట్టు ఎక్కించారు.

# భారత్ 2027 వరల్డ్ కప్ ప్లాన్ ఇదేనా? రోహిత్, కోహ్లీపై గంభీర్ వ్యాఖ్యలు వైరల్!



**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్‌తో త్వరలో జరగనున్న 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల రూపంలో అత్యంత అనుభవజ్ఞులైన ఆటగాళ్ల అండ లభిస్తోందని ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పేర్కొన్నారు. గతేడాది వన్డే కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన గిల్ నాయకత్వానికి ఈ సీనియర్ల అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

**గంభీర్ ప్రశంసలు – కోహ్లీ, రోహిత్ పాత్ర:**
జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కోచ్ గంభీర్ మాట్లాడుతూ.. వన్డే క్రికెట్‌లో రోహిత్, విరాట్ లాంటి దిగ్గజాలు మైదానంలోనూ, మైదానం బయట గిల్‌కు సహాయపడే స్థితిలో ఉండటం అతడు చేసుకున్న అదృష్టమని వెల్లడించారు. ముఖ్యంగా యువ వయసులో ఉద్వేగాలకు లోనయ్యే ఛాన్స్ ఉంటుందని, కానీ గిల్ భావోద్వేగాలను పక్కన పెట్టి ప్రశాంతంగా వ్యవహరిస్తున్నాడని గౌతమ్ గంభీర్ కొనియాడారు.

**గిల్ లీడర్‌షిప్ స్టైల్ పై కోచ్ అంచనాలు:**
26 ఏళ్ల శుభ్‌మన్ గిల్ తన నాయకత్వ లక్షణాలతో అన్ని విభాగాల్లోనూ అద్భుతంగా రాణిస్తున్నాడని గౌతమ్ గంభీర్ ప్రశంసించారు. గిల్ ఎంతో ప్రశాంతంగా, నిస్వార్థంగా, దూకుడుగా వ్యవహరిస్తూ కేవలం పరుగులతోనే కాకుండా తన ఆచరణ ద్వారా జట్టుకు ఆదర్శంగా నిలుస్తున్నాడని పేర్కొన్నాడు. వన్డే క్రికెట్‌లో గిల్‌కు ఇటీవలి కాలంలో కొంత కష్టకాలం ఎదురైనప్పటికీ, అతడు సరైన మార్గంలోనే పయనిస్తున్నందున త్వరలోనే మెరుగైన ఫలితాలు వస్తాయని గంభీర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

**భారత్ వర్సెస్ వెస్టిండీస్ సిరీస్ షెడ్యూల్:**
ఈ సిరీస్‌లో భాగంగా తొలి వన్డే సెప్టెంబర్ 27వ తేదీన తిరువనంతపురంలోని గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరగనుంది. రెండో వన్డే సెప్టెంబర్ 30న గువహటిలోనూ, మూడో వన్డే అక్టోబర్ 3న న్యూ చండీగఢ్‌లోనూ నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆ తర్వాత ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరగనుండగా, అది అక్టోబర్ 17వ తేదీన బెంగళూరులో ముగుస్తుంది. ఈ జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలతో పాటు వైస్ కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ కూడా కొనసాగుతున్నారు.

**వెస్టిండీస్‌పై గిల్ అద్భుత రికార్డు:**
వెస్టిండీస్ జట్టుపై శుభ్‌మన్ గిల్‌కు అద్భుతమైన రికార్డు ఉంది. విండీస్‌పై ఇప్పటి వరకు 6 వన్డే మ్యాచ్‌లు ఆడిన గిల్ 66.2 సగటుతో, 92.71 స్ట్రైక్ రేట్‌తో మొత్తం 331 పరుగులు సాధించారు. ఇందులో అతని అత్యధిక వ్యక్తిగత స్కోరు 98 పరుగులు.. సీనియర్ ఆటగాళ్ల అనుభవాన్ని అందిపుచ్చుకుంటూ గిల్ తన కెప్టెన్సీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించనున్నారు.

# 66 -- 28తో థాయ్‌లాండ్ చిత్తు.. ఆసియా గేమ్స్ కబడ్డీ ఫైనల్‌లోకి టీమిండియా!

**హైదరాబాద్ పెన్ పవర్:** పాన్‌లోని ఐచి-నగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలు కబడ్డీ టోర్నమెంట్‌లో భారత పురుషుల జట్టు కిరాక్ ప్రదర్శనతో చెలరేగింది. టోకై సిటిజన్స్ జిమ్నాసియంలో జరిగిన ఉత్కంఠభరితమైన సెమీఫైనల్ పోరులో డిఫెండింగ్ చాంపియన్ భారత్ 66--28 తేడాతో థాయిలాండ్‌ను చిత్తు చేసి ఫైనల్‌లోకి దూసుకెళ్లింది.

**ఆరంభం నుంచే ఆధిపత్యం:**
గ్రూప్-ఏ లో అన్ని మ్యాచ్‌లు గెలిచి అగ్రస్థానంతో సెమీస్‌లోకి అడుగుపెట్టిన భారత జట్టు, నాకౌట్ దశలో ఎలాంటి తడబాటు లేకుండా ఆడింది. ఇండియన్ డిఫెన్స్ విభాగంలో జైదీప్ దహియా, సుమిత్, రాహుల్ సేథ్‌పాల్, కెప్టెన్ సునీల్ కుమార్ అద్భుతంగా ఆడాడు. ఎనిమిది సార్లు ఆసియా క్రీడల కబడ్డీ చాంపియన్‌గా నిలిచిన భారత్, మ్యాచ్ ప్రారంభమైన మొదటి 5 నిమిషాల వ్యవధిలోనే థాయిలాండ్‌ను తొలిసారి ఆల్‌ఔట్ చేసి పూర్తి ఆధిక్యాన్ని సంపాదించింది.

**థాయిలాండ్ ప్రతిఘటన – భారత రెయిడర్ల జోరు:**
మొదటి ఎదురుదెబ్బ నుంచి థాయిలాండ్ జట్టు మెల్లగా కోలుకుంది. థాయిలాండ్ ప్లేయర్ ధీరడెట్ చైసిత్ కొన్ని సంచనాత్మక సూపర్ రెయిడ్స్‌తో పాటు వరుస సక్సెస్‌ఫుల్ రెయిడ్స్‌తో విరుచుకుపడ్డాడు. ఆశ్చర్యకరంగా భారత్‌ను ఆల్- ఔట్ చేసి స్కోరును 24-14 కు తగ్గించాడు. కానీ, భారత రెయిడర్ దేవంక్ దలాల్ అద్భుతమైన ప్రదర్శనతో విజృంభించారు. మొదటి హాఫ్ ముగిసేసరికి భారత్ 37--18 ఆధిక్యంలో నిలిచింది.

**సెకండ్ హాఫ్ లోనూ తగ్గని జోరు:**
రెండో అర్ధభాగంలోనూ మ్యాచ్‌పై భారత జట్టు పూర్తి నియంత్రణ సాధించింది. థాయిలాండ్ తరఫున చైసిత్ ఒంటరి పోరాటం చేసినప్పటికీ, టీమిండియా వ్యూహాత్మకంగా ఆడుతూ మరో రెండుసార్లు థాయిలాండ్‌ను ఆల్- ఔట్ చేసింది. చివరికి 66-28 భారీ స్కోరుతో ఘన విజయం సాధించి ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది.

**స్వర్ణ పతక పోరుకు సర్వం సిద్ధం:**
(సెప్టెంబర్ 26, శనివారం) జరిగే ఏషియన్ గేమ్స్ 2026 కబడ్డీ స్వర్ణ పతక పోరులో భారత్.. ఇరాన్, చైనీస్ తైపీ జట్ల మధ్య జరిగే మరో సెమీఫైనల్ విజేతతో తలపడనుంది. ఆసియా

క్రీడల కబడ్డీ చరిత్రలో 1--0 తో ఎడిషన్లలో ఇండియా ఫైనల్ చేరడం ఇది తొమ్మిదోసారి కావడం విశేషం. కాగా, 2018 జకార్తా గేమ్స్‌లో కాంస్యంతో సరిపెట్టుకోవడం మినహా ప్రతీసారి భారత్ ఫైనల్‌కు చేరుకుంది. ఈ టోర్నమెంట్‌లో కాంస్య పతక పోరు ఉండదని, సెమీఫైనల్స్‌లో ఓడిన రెండు జట్లు పోడియం స్థానాలను దక్కించుకుంటాయని నిర్వాహకులు తెలిపారు.

# నిఖిల్- తేజ అన్నదమ్ముల్లా ఒకే మార్గంలో!









టాలీవుడ్‌లో సరికొత్త కంటెంట్‌తో పాన్ - ఇండియా స్థాయిలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోలు నిఖిల్ సిద్ధార్థ్, తేజా సజ్జా. వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకుంటూ కాన్సెప్ట్ ఆధారిత చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద విజయం సాధించడంలో ఇద్దరి శైలి ఒకేలా కనిపిస్తుంది. వినూత్న ప్రయోగాలకు ప్రాధాన్యమిస్తూ, ఒకే రకమైన విజన్‌తో ప్రయాణిస్తున్న ఇద్దరు నటులు పరిశ్రమలో అన్నదమ్ముల్లా ఒకే బాటలో పయనిస్తున్నారనే అభిప్రాయం విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది.

-కార్తికేయ 2- చిత్రంతో జాతీయ స్థాయిలో అద్భుత విజయాన్ని అందుకున్న నిఖిల్ తదుపరి ప్రాజెక్ట్‌లను కూడా అదే స్థాయిలో ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రయోగాత్మక కథలను ఎంచుకుంటూనే సాంస్కృతిక, చారిత్రక అంశాలకు ప్రాధాన్యమిచ్చే భారీ చిత్రాలలో నటిస్తున్నారు. ఆయన లైనప్‌లో ప్రస్తుతం -స్వయంభూ- పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటోంది. వీటితో పాటు చారిత్రక ప్రాధాన్యత ఉన్న -ది ఇండియా హౌస్- అనే మరో పాన్ -ఇండియా చిత్రం లైన్లో ఉంది. తిరుగులేని బ్లాక్‌బస్టర్ అందించిన ఫ్రాంచైజీలో రాబోతున్న -కార్తికేయ 3- పనులు జరుగుతున్నాయి.

మరోవైపు చైల్డ్ ఆర్టిస్ట్‌గా పరిశ్రమలోకి వచ్చి -హను-మాన్- చిత్రంతో పాన్ ఇండియాలో క్రేజ్ సంపాదించుకున్నారు తేజా సజ్జా. ఫాంటసీ, మైథాలజీ, గ్రాఫికల్ విజువల్స్‌తో కూడిన కథలను నమ్ముకుంటూ తనకంటూ ప్రత్యేక మార్గాన్ని సుగమం చేసుకున్నారు. ప్రస్తుతం తేజ నటిస్తోన్న -మిరాయి2- చిత్రం సూపర్ హీరో యాక్షన్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతుండగా .. -జాంబీ రెడ్డి- సీక్వెల్ గా -జాంబీ రెడ్డి 2- పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి.

ఇలా ఇద్దరి లైనప్‌లను గమనిస్తే కొన్ని ఆసక్తికరమైన సమానత్వాలు కనిపిస్తాయి. ఇద్దరూ రొటీన్ కమర్షియల్ ఫార్మాట్లకు దూరంగా ఉంటున్నారు. విజువల్స్‌కు ప్రాధాన్యత ఉన్న కాన్సెప్ట్‌లకే జై కొడుతున్నారు. ఒకరికి కార్తికేయ సిరీస్ ఎలాగైతే గ్లోబల్ గుర్తింపు తెచ్చిపెట్టిందో? మరొకరికి -హను-మాన్- క్రేజ్ తెచ్చింది. మైథాలజీ, హిస్టరీ, అడ్వెంచర్ ఎలిమెంట్స్ మిళితం చేసిన కథలను ఎంచుకోవడంలో నిఖిల్, తేజలు ఒకే మైండ్‌సెట్‌తో ముందుకెళ్తున్నారు. ఈ రకమైన కంటెంట్ ఓరియెంటెడ్ ఎంపికలు టాలీవుడ్ స్థాయిని అంతర్జాతీయ వేదికపైకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. కేవలం ప్రాంతీయ మార్కెట్‌కే పరిమితం కాకుండా ఉత్తరాది ప్రేక్షకులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆకట్టుకునేలా ఇద్దరు సబ్జెక్ట్‌లను ఎంచుకుంటున్నారు. భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న సినిమాలు బాక్సాఫీస్ వద్ద సేఫ్ బెట్‌గా మారడమే కాకుండా యంగ్ జనరేషన్ హీరోలకు కొత్త దిశానిర్దేశం చేస్తున్నాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965